

# నేటి నుంచి ఐపీఎల్

అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్రికెట్ పండుగ రానే వచ్చింది. మండు వేసవిలో ఇంటిల్లిపాదిని అలరించేందుకు అన్ని హంగులతో ఐపీఎల్ ముస్తాబైంది. సొంతగడ్డపై ప్రతిష్టాత్మక టీ20 ప్రపంచకప్ విజయాన్ని ఆస్వాదిస్తూనే ఐపీఎల్ మజాను పొందేందుకు ఫ్యాన్స్ ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. 18 సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకుని 19వ సీజన్‌లోకి అడుగుపెడుతున్న ఐపీఎల్..ఈసారి మరింత జోష్‌ను అందించడం ఖాయంగా కనిపిస్తున్నది. పొట్టి ప్రపంచకప్‌తో కోట్లాది మంది అభిమానుల కల నెరవేరిన వేళ ఐపీఎల్ రెట్టింపు క్రేజ్‌తో దుమ్మురేపే అవకాశముంది.


నిజామాబాద్
శనివారం
28.03.2026

సంపుటి : 16 సంచిక: 180
పేజీలు: 6 వెల: రూ. 5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్

# చట్టం

సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక


# కరీంనగర్‌లో భారీ బ్యాంకింగ్ స్కామ్



## కరీంనగర్ ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో రూ. 137 కోట్ల భారీ కుంభకోణం

బ్రాంచ్ మేనేజర్, ఉద్యోగులు సహా 13 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు

చైనా ముఠాతో కలిసి హవాలా, సైబర్ నేరాలకు పాల్పడినట్లు గుర్తింపు

అమాయకుల పేర్లతో 7 నకిలీ ఖాతాలు తెరిచి కోట్లు మళ్లించారు

కమీషన్ ఆశతో డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు కూడా నిందితులుగా మారారు

ఖాతా వివరాలు ఎవరికీ ఇవ్వొద్దని, మోసం జరిగితే 1930కి కాల్ చేయాలని సూచన

**కరీంనగర్ నడిబొడ్డున ఉన్న ఆర్బీఎల్ బ్యాంకులో చోటుచేసుకున్న భారీ కుంభకోణం యావత్ రాష్ట్రాన్ని ఉలిక్కిపడేలా చేసింది. మాయగాళ్లు సృష్టించిన నకిలీ ఖాతాలు, మ్యూల్ అకౌంట్ల ద్వారా ఏకంగా రూ.137 కోట్ల మేర అక్రమ లావాదేవీలు సాగించిన వైనం పోలీసుల దర్యాప్తులో బట్టబయలైంది. ఈ ఆర్థిక నేరంలో సామాన్యులు, విద్యార్థులే కాకుండా ప్రజల సొమ్ముకు రక్షణగా ఉండాల్సిన బ్యాంకు ఉన్నతోద్యోగులే సూత్రధారులుగా మారడం విస్మయానికి గురిచేస్తోంది.**

**చట్టం, స్టేట్ బ్యూరో:**

చైనా దేశీయులతో చేతులు కలిపిన స్థానిక కేటుగాళ్లు అంతర్జాతీయ స్థాయిలో హవాలా నెట్‌వర్క్‌ను నడిపించినట్లు ఆధారాలు లభించాయి. ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం నేతృత్వంలోని బృందం లోతైన దర్యాప్తు చేపట్టింది. కేవలం ఏడు మ్యూల్ ఖాతాలను వేదికగా చేసుకుని ఇంత భారీ స్థాయిలో నిధులను మళ్లించడం వెనుక పక్కా ప్రణాళిక ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నిందితులు అమాయకులను లక్ష్యంగా చేసుకుని వారి పేరిట ఖాతాలు తెరిపించి, ఆపై వాటిని నేరాలకు వాడుకున్నారు. ఈ క్రమంలోనే బ్యాంకు మేనేజర్‌తో పాటు మొత్తం 13 మందిని పోలీసులు కటకటాల వెనక్కి పంపారు. పట్టుబడిన వారిలో ఉన్నత విద్యావంతులు ఉండటం గమనార్హం. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న బండారి సాయిరామ్ అనే వ్యక్తి చైనాకు చెందిన సైబర్ నేరగాళ్లతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉన్నాడు. విదేశాల్లో కూర్చుని మోసాలకు పాల్పడే ముఠాకు ఇక్కడ భారత్‌లో బ్యాంకింగ్ వ్యవస్థను అనుసంధానించడంలో ఇతడు కీలక పాత్ర పోషించాడు. ప్రతి ఒక్క లావాదేవీ పైన సాయిరామ్ రెండు శాతం కమీషన్ పొందేవాడని పోలీసుల విచారణలో తేలింది. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే దురాశతో ఇతడు అంతర్జాతీయ నేరగాళ్లకు సహకరించినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఖాతాల నిర్వహణలో కీలకంగా ఉన్న ఆర్బీఎల్ బ్యాంకు మేనేజర్, మరికొందరు ఉద్యోగులు ఈ కుంభకోణంలో ప్రత్యక్షంగా పాలుపంచుకున్నారు. బ్యాంకు నిబంధనలను తుంగలో తొక్కి, కనీస కేవైసీ పత్రాల తనిఖీ లేకుండానే ఖాతాలను మంజూరు చేసినట్లు విచారణలో వెల్లడైంది. బ్యాంకు అంతర్గత వ్యవస్థలోని లోపాలను నేరగాళ్లు అనుకూలంగా మార్చుకున్నారు. నకిలీ చిరునామాలతో తెరిచిన ఈ ఖాతాల్లోకి రోజుకు కోట్ల రూపాయల నగదు వచ్చి చేరుతుంటే, అది అధికారుల కంటపడకపోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని అనుమానిస్తున్నారు.



అరెస్టయిన వారి జాబితాను పరిశీలిస్తే డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు ఉండటం విచారకరం. భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో చదువుకోవాల్సిన యువత, కొద్దిపాటి డబ్బు కోసం సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్నారు. మధ్యవర్తుల మాటలు నమ్మి తమ ఆధార్, పాన్ కార్డులను ఇతరులకు అప్పగించి తీవ్ర ఇబ్బందుల్లో పడ్డారు. చదువుకున్న వారే కాకుండా, నిరక్షరాస్యుల పేదరికాన్ని ఆసరాగా చేసుకుని వారి వేలిముద్రలు సేకరించి ఖాతాలు సృష్టించిన ఉదంతాలు కూడా ఈ దర్యాప్తులో వెలుగుచూశాయి. సైబర్ మాయగాళ్లు తమ నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకోవడానికి ఈ మ్యూల్ ఖాతాలను ఒక కవచంలా వాడుకుంటారు. బెట్టింగ్, డ్రగ్స్ రవాణా, ఆన్‌లైన్ చోరీల ద్వారా సంపాదించిన సొమ్ము నేరుగా తమ సొంత ఖాతాల్లోకి వెళ్తే పోలీసులకు దొరికిపోతామనే భయం వారిలో ఉంటుంది. అందుకే ఇలాంటి అమాయకుల ఖాతాల్లోకి డబ్బును పంపించి, అక్కడి నుంచి ఇతర ఖాతాలకు బదిలీ చేస్తారు. చివరకు విచారణ జరిగితే ఈ ఖాతాదారులు మాత్రమే దోషులుగా నిలబడతారు, అసలు నేరగాళ్లు మాత్రం తెర వెనుకే ఉండిపోతారు.

కమీషన్ల కోసం కక్కుర్తి పడటం వల్ల జీవితాలు ఎలా నాశనం అవుతాయో ఈ ఘటన ఒక పాఠంలా నిలుస్తోంది. అపరిచిత వ్యక్తులు వచ్చి ఫోన్ నంబర్లు, బ్యాంకు వివరాలు అడిగితే తక్షణమే అప్రమత్తం కావాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. కేవలం వెయ్యి రూపాయల కోసం ఇచ్చే ఆధార్ కార్డు చివరకు కోట్లాది రూపాయల ఆర్థిక నేరానికి దారి తీయవచ్చు. సమాజంలో పెరుగుతున్న ఇలాంటి నేరాల పట్ల యువత, విద్యార్థి లోకం అప్రమత్తంగా లేకపోతే జైలు పాలు కావాల్సి వస్తుందని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ లావాదేవీలపై కనీస అవగాహన కలిగి ఉండటం అత్యవసరం. తెలియని వారి ఖాతాల నుంచి తమ ఖాతాకు నగదు వచ్చినా, లేక మన ఖాతా నుంచి ఎవరికో డబ్బు పంపమని ఎవరైనా కోరినా ఖచ్చితంగా నిరాకరించాలి. ఏవైనా అనుమానాస్పద లావాదేవీలు కనిపిస్తే వెంటనే బ్యాంకు అధికారులను సంప్రదించాలి. సైబర్ నేరగాళ్లు నిరంతరం కొత్త పద్ధతుల ద్వారా సామాన్యులను దోచుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉంటారని, అలాంటి వారి మాయలో పడవద్దని పోలీసులు కోరుతున్నారు. బాధితులు ఎవరైనా సైబర్ మోసానికి గురైన వెంటనే జాప్యం చేయకుండా 1930 అనే అత్యవసర నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సిపి గౌస్ ఆలం సూచించారు. అలా చేసినప్పుడే నేరగాళ్లు మళ్లించిన నగదును ఇతర ఖాతాల్లో స్తంభింపజేయడానికి (ఫ్రీజ్) అవకాశం ఉంటుంది. సమయం గడిచే కొద్దీ నేరగాళ్లు ఆ సొమ్మును విదేశాలకు మళ్లించే ప్రమాదం ఉందని, తక్షణ స్పందన మాత్రమే బాధితులను ఆదుకుంటుందని వివరించారు. ఈ కేసులో మరిన్ని ఆధారాల కోసం పోలీసు బృందాలు ఇతర రాష్ట్రాల్లో కూడా గాలింపులు చేపడుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకుంటూ నేరగాళ్లు బ్యాంకు వ్యవస్థలను సైతం సవాలు చేస్తున్నారు. సామాన్య ప్రజలు తమ వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుకోవాల్సిన బాధ్యతను గుర్తుంచుకోవాలి. బ్యాంకు సిబ్బంది అడిగితే తప్ప ఎవరికీ ఓటీపీలు, పిన్ నంబర్లు వెల్లడించకూడదు. కరీంనగర్ ఘటనలో బ్యాంకు ఉద్యోగుల ప్రమేయం ఉండటం వల్ల ప్రజలు తాము డబ్బు దాచుకున్న సంస్థలపై నమ్మకాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. దీనిని నివారించడానికి ఉన్నత స్థాయి పర్యవేక్షణ పెరగాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఈ కుంభకోణం వెనుక ఉన్న ఇతర నెట్‌వర్క్ సభ్యులను పట్టుకోవడానికి దర్యాప్తు సంస్థలు వేగంగా పావులు కదుపుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి మ్యూల్ ఖాతాలు ఇంకెన్ని ఉన్నాయనే అంశంపై ప్రత్యేక నిఘా పెట్టారు. అక్రమ సంపాదన కోసం సమాజ శాంతిని దెబ్బతీసే ఇలాంటి ముఠాల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. సామాన్య పౌరులు తమ ఆస్తులను, వ్యక్తిగత పత్రాలను కాపాడుకోవడంలో జాగ్రత్త వహించినప్పుడే సైబర్ నేరాలను సమర్థంగా అడ్డుకోవడం సాధ్యమవుతుంది.

# మూడు రోజుల పాటు భారీ వర్షాలు

## ఉక్కపోత నుంచి ఉపశమనం.. మూడు రోజుల పాటు వర్షాలు



**చట్టం, స్టేట్ బ్యూరో:**

వేసవి భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ కాస్త ఉపశమనం కలిగించే వార్తను అందించింది. గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్న ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో రానున్న మూడు రోజుల పాటు వాతావరణం చల్లబడనుందని అంచనా వేసింది. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.తెలుగు వార్తలు తెలంగాణపై ప్రస్తుతం ఉన్న వాతావరణ ద్రోణి ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. మరత్వాడా నుంచి కర్ణాటక తీరం వరకు సముద్ర మట్టానికి సుమారు 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఈ ద్రోణి కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు సంభవించాయి. దీని ఫలితంగా శుక్ర, శని, ఆదివారాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా వర్షం కురిసే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు మెరుపులతో కూడిన జల్లులు పడతాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అయితే.. ఈ ఉపశమనం తాత్కాలికమేనని, వచ్చే వారం నుంచి ఎండల తీవ్రత మళ్లీ పెరిగే అవకాశం ఉందని, సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు అధికం కావచ్చని అధికారులు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా వాతావరణ పరిస్థితులు ఆసక్తికరంగా మారాయి. దిగువ ట్రోపో ఆవరణంలో ఆగ్నేయ, నైరుతి దిశల నుంచి వీస్తున్న గాలుల ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమ, యానాం ప్రాంతాల్లో రాబోయే మూడు రోజులు వర్ష సూచన ఉంది. శుక్రవారం వాతావరణం పొడిగా ఉన్నప్పటికీ.. శని, ఆదివారాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. కోస్తాంధ్రలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉండగా.. రాయలసీమలో మాత్రం వచ్చే ఐదు రోజుల పాటు ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగనున్నాయి. మిగిలిన ప్రాంతాల్లో మాత్రం మూడు రోజుల తర్వాత ఎండల తీవ్రత పెరిగే సూచనలు ఉన్నాయి.

**రైతులకు, ప్రజలకు సూచనలు**

అకాల వర్షాలు, బలమైన గాలుల నేపథ్యంలో రైతులు తమ కోతకు వచ్చిన పంటలను భద్రపరుచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆరబోసిన ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండల తీవ్రత పెరిగే సమయంలో మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల మధ్య బయటకు రాకుండా ఉండటం శ్రేయస్కరం.

# గడ్డి మందుపై నిషేధం విధించాలి

## లోక్‌సభలో ఎంపీ కావ్య డిమాండ్

**చట్టం, స్టేట్ బ్యూరో:**

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు)పై పూర్తి నిషేధం విధించాలని చేసిన డిమాండ్ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. శుక్రవారం పార్లమెంట్ జీరో అవర్‌లో ఆమె ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఈ రసాయనం వల్ల పర్యావరణం , మానవ ఆరోగ్యంపై పడుతున్న దుష్ప్రభావాలను వివరించారు. పారాక్వాట్ డైక్లోరైడ్ కేవలం కలుపు మొక్కలను నివారించే రసాయనం మాత్రమే కాదని, ఇది నేల, నీరు, గాలిని తీవ్రంగా కలుషితం చేస్తోందని ఎంపీ స్పష్టం చేశారు. వ్యవసాయ క్షేత్రాల్లో దీని మితిమీరిన వాడకం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా.. భూగర్భ జలాలు కూడా విషతుల్యం అవుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది పరోక్షంగా ఆహారపు గొలుసులోకి చేరి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని హెచ్చరించారు. ఎంపీ కావ్య ప్రసంగంలో అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే.. గ్రామీణ ప్రాంతాల్లో ఈ గడ్డి మందు ఆత్మహత్యలకు ప్రధాన సాధనంగా మారడం. చిన్నపాటి మనస్పర్థలు లేదా క్షణికావేశంలో ఈ రసాయనాన్ని సేవించిన వారు ప్రాణాలు కోల్పోతున్నారని ఆమె పేర్కొన్నారు. పారాక్వాట్ సేవించిన సందర్భాల్లో మరణాల రేటు దాదాపు 100 శాతం ఉండటం అత్యంత భయానకమైన విషయం. దీనికి ఇప్పటివరకు ఎటువంటి



విరుగుడు అందుబాటులో లేకపోవడం వల్ల ఆసుపత్రికి చేరినా ప్రాణాలు కాపాడటం అసాధ్యంగా మారుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ సహా తెలంగాణలోని అనేక జిల్లాల్లో పారాక్వాట్ వల్ల జరుగుతున్న ప్రాణనష్టాన్ని ఎంపీ వివరించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (IMA), పలువురు వైద్య నిపుణులు కూడా ఈ రసాయనం వల్ల కలిగే ముప్పును గుర్తించి, దీనిపై నిషేధం విధించాలని ఇప్పటికే గళమెత్తారు. ప్రజల ప్రాణాలను కాపాడటం కంటే వేరే ఏదీ ముఖ్యం కాదని, అందుకే కేంద్ర ప్రభుత్వం తక్షణమే దీని తయారీ, అమ్మకాలు , వినియోగంపై సంపూర్ణ నిషేధం విధించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రమాదకరమైన ఇటువంటి రసాయనాలకు బదులుగా పర్యావరణహితమైన, సురక్షితమైన ప్రత్యామ్నాయాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని.. ఈ దిశగా ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆమె కోరారు.

# 25న కవిత కొత్త పార్టీ !



**చట్టం ప్రతినిధి కామారెడ్డి**

శ్రీరామనవమి వేళ మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక ప్రటకన చేశారు. వచ్చే ఏప్రిల్ 25వ తేదీన కొత్త పార్టీ పెట్టబోతున్నట్లు అధికారిక ప్రకటన చేశారు. ఆరోజే పార్టీ పేరు, జెండా ఆవిష్కరణ ఉంటుందని వెల్లడించారు. తన మెట్టినిల్లు అయిన నిజామాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె ఈ ప్రకటన చేశారు. మేడ్చల్ మునీరాబాద్ గ్రామంలోని అద్వయ కన్వెషన్‌లో నిర్వహించే పార్టీ ఆవిర్భావ సభకు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. మార్పు కోరుకునే అభ్యుదయ వాదులు అందరూ తనతో కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. శ్రీరాముడి దయతో అందరినీ కలుపుకొని పోతామని హామీ ఇచ్చారు. అనంతరం ఖిల్లా రామాలయంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో బలమైన రాజకీయ శక్తి కావాలి. సర్వోదయ తెలంగాణ సాధన కోసమే కొత్త పార్టీ రావాలి. తెలంగాణ సాధించి పన్నెండేళ్లు దాటింది. నీళ్లు, నిధులు, నియామకాలు సంపూర్ణంగా సాధించుకోలేకపోయాం. ఎలాంటి పరిపాలనలో ఉన్నామో ప్రజలు ఆలోచించాలి. కొత్త రాజకీయ పార్టీ ఉండాలని బలంగా కోరుకుంటున్నాం' తమ అజెండా ఏంటనేది 25న ప్రకటిస్తా అని కవిత ప్రకటన చేశారు.

**కొత్త తరానికి అవకాశం**

కొత్త తరం నాయకత్వానికి, మహిళా సాధికారతకు పార్టీలో పెద్దపీట వేయనున్నట్లు కవిత వెల్లడించారు. అయితే.. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత కవిత తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ మరియు బీఆర్ఎస్ వర్గాల్లో ఈ కొత్త పార్టీ ప్రభావంపై ముమ్మర చర్చ సాగుతోంది. తెలంగాణ సెంటిమెంట్‌తో పాటు సాంస్కృతిక మూలాలను బలంగా విశ్వసించే కవిత, ఈ పార్టీ ద్వారా ప్రజల్లోకి ఎలా వెళ్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## వదంతులు నమ్మొద్దు: గ్యాస్, ఇంధన సరఫరాపై

# మెదక్ జిల్లాలో ఎటువంటి కొరత లేదు

**చట్టం మెదక్ ప్రతినిధి :**

మెదక్ జిల్లాలో గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ సరఫరా విషయంలో ఎటువంటి కొరత లేదని జిల్లా పరిపాలన స్పష్టం చేసింది. బుకింగ్ చేసుకున్న ప్రతి ఒక్కరికీ యథావిధిగా సరఫరా జరుగుతోందని తెలిపింది. వదంతులను నమ్మి అవసరానికి మించి నిల్వ చేసుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. జిల్లాలో LPG గ్యాస్ సరఫరా సమృద్ధిగా ఉందని, రోజుకు సుమారు 3000 సిలిండర్లు బుక్ అవుతుండగా వాటికి 100 శాతం డెలివరీ జరుగుతోందని వెల్లడించింది. అదనంగా గ్యాస్ గోదాముల్లో సుమారు 3500 సిలిండర్లు నిల్వ ఉండగా, మరో 6500 సిలిండర్లు రవాణాలో ఉన్నాయని పేర్కొంది. పెట్రోల్, డీజిల్ సరఫరా కూడా ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగుతోందని తెలిపింది. జిల్లాలో మొత్తం 87 పెట్రోల్ బంకులు, 16 LPG గ్యాస్ ఏజెన్సీలు సాధారణంగా పనిచేస్తున్నాయని వివరించింది. ప్రతిరోజు అవసరమయ్యే 90 కిలోలీటర్ల పెట్రోల్, 110 కిలోలీటర్ల డీజిల్‌కు మించి ప్రస్తుతం 550 కిలోలీటర్ల పెట్రోల్, 644 కిలోలీటర్ల డీజిల్ నిల్వలో ఉన్నాయని వెల్లడించింది. కొన్ని పెట్రోల్ బంకుల వద్ద కనిపిస్తున్న క్యూలు వదంతుల కారణంగా ప్రజలు అవసరానికి మించి ఇంధనం కొనుగోలు చేయడం వల్లనే ఏర్పడుతున్నాయని పేర్కొంది. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్ కార్యకలాపాలను అరికట్టేందుకు సివిల్ సప్లైస్, రెవెన్యూ, లీగల్ మెట్రాలజీ, పోలీస్ శాఖల సంయుక్త బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాయి. మెదక్ పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో నిర్వహించిన తనిఖీల్లో గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నట్లు గుర్తించి 134 సిలిండర్లను స్వాధీనం చేసుకుని 83 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజలు వాహనాల్లో ఇంధనం తక్కువగా ఉన్నప్పుడు మాత్రమే బంకులకు వెళ్లాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే ధృవీకరించని సమాచారాన్ని నమ్మకూడదని, ఇతరులకు పంపకూడదని హెచ్చరించారు. ప్రభుత్వం లేదా చమురు కంపెనీల అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 9391942254 ను సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలో గ్యాస్, ఇంధన కొరత లేదని స్పష్టం చేస్తూ ప్రజలు ఆందోళన చెందకుండా సంయమనం పాటించాలని సూచించారు.



# ఢిల్లీలో గోల్డ్ మెన్ బంగారం అంతా సీజ్

**ఇన్కమ్ టాక్స్ అధికారుల అదుపులో "కొండ విజయ్"**

**చట్టం శేరిలింగంపల్లి:**

శేరిలింగంపల్లికి చెందిన బంగారు బాబు, హోప్ ఫౌండేషన్, తెలంగాణ హాకీ చైర్మన్ కొండ విజయ్ కుమార్ ను ఢిల్లీ ఇన్కమ్ టాక్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. న్యూఢిల్లీలో జరుగుతున్న హాకీ ఇండియా అవార్డుల ప్రధానోత్సవానికి బయలుదేరిన కొండ విజయ్ కుమార్ ను హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో గురువారం సాయంత్రం స్థానిక ఐటీ అధికారులు అడ్డుకొని పాన్ కార్డు స్వాధీనం చేసుకున్నారు. తదనంతరం కొండ విజయ్ కుమార్ న్యూఢిల్లీ ఎయిర్ పోర్టులో దిగగానే అక్కడి ఢిల్లీ ఇన్కమ్ టాక్స్ అధికారులు నలుగురు వారిని అదుపులోకి తీసుకొని ఎయిర్ పోర్టు లోనే విచారణ ప్రారంభించారు.తన ఒంటిపైన ఉన్న బంగారం మొత్తాన్ని సీజ్ చేయడంతో పాటు వారి పేరుతో ఉన్న స్థిర, చర ఆస్తుల వివరాలను సేకరించే పనిలో పడ్డారు. 12 గంటల పాటు విచారించిన అధికారులు అవార్డుల ప్రధానోత్సవానికి వెళ్లడానికి అనుమతిని ఇచ్చారు. అనంతరం మళ్లీ వారిని విచారణకు హాజరు కావాల్సిందిగా సూచించినట్లు సమాచారం. అయితే సీజ్ చేసిన బంగారాన్ని తిరిగి ఇస్తారా, వారిని విడుదల చేస్తారా అనేది వారి ఇన్కమ్ టాక్స్ చెల్లింపుల పైన ఆధారపడి ఉంది.



CHATTAM NEWS

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

## స్వప్నలోక్‌లో ఘనంగా సీతారామ కల్యాణం



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి):** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్వప్నలోక్ కాలనీలో కొలువై ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని స్వప్నలోక్ కార్యవర్గం, కాలనీవాసుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారని ఆలయ అర్చకులు శ్రీహర్ష తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీ రామనవమి సందర్భంగా శుక్రవారం ఉదయం ఆలయంలో అఖండ నామము, సుప్రభాతసేవ, మూల విరాట్లకు, ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకం, మంగళస్నానం, సహస్రనామార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ, సాయంత్రం పల్లకీ సేవలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ కాసర్ల గోదావరి స్వామి, 11వ వార్డ్ కౌన్సిలర్ రాణి శ్రీనివాస్, కాలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నేడే హిందూ సమ్మేళనం



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పెర్కిట్ కుక్కల గుట్ట శ్రీవెంకటేశ్వర మందిర ప్రాంగణములో నేడు శనివారం రోజున సాయంత్రం 5:30 గంటలకు హిందూ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించిదం జరుగుతుందనీ నిర్వహణ కమిటీ అధ్యక్షులు బెన్నాజి రాజేశ్వర్, సభ్యులు క్యాతం బాపురెడ్డి, జక్కుల శ్రీధర్, గటడి అంజలి, జనార్ధన్ నాగమణిలు మాట్లాడుతూ, ముఖ్యఅతిథిగా ఆధ్యాత్మిక గురువు, విశ్వసమాజం, శ్రీ వీర ధర్మజ పీఠం హైదరాబాద్ శ్రీశ్రీశ్రీ విశ్వ బ్రహ్మశ్రీ పూజ వీరధర్మజ స్వామీజీ, ప్రధాన వక్త ఆర్ఎస్ఎస్ సహ ప్రాంత ప్రచారక్, తెలంగాణ కల్పగురి ప్రభుకుమార్, వక్త గా ఆచార్యులు, సేవికాసమితి నిజామాబాద్ శుభ దేశ్ పాండే హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ఆత్మీయ హైందవ సోదర సోదరీ మణులారా ఆత్మ, ప్రాణం, హిందూ సంస్కృతి, హిందూ సమాజం ఇటువంటి హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి సమైక్యపరిచి మన దేశాన్ని విశ్వగురువుగా నిర్మాణం చేయాలనే లక్ష్యంతో రండి! కదలి రండి! దేశ రక్షణ కొరకు, ధర్మ రక్షణ కొరకు సంస్కృతి రక్షణ కొరకు భారతమాత సేవలో ప్రతిజ్ఞ భూని ఈ మహత్కార్యం లో హిందూ బంధువులందరి భాగస్వామ్యాన్ని కోరుకుంటూ హిందూ సమ్మెనం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కావున సమస్త హిందూ బంధువులు ఈ కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గొని హిందూ ఐక్యతను, సమరసతను చాటవలసిందిగా ఈ సందర్భంగా వారు కోరుతూ ప్రతి హిందూ కుటుంబాన్ని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జెస్సు అనిల్ కుమార్, డాకూరి ప్రవీణ్, గంగరాజుల నర్సయ్య, ఖండోబా ప్రవీణ్ జీవి గంగారాం, ఎలిషాల గంగాధర్ రిటైర్డ్ ఎక్సైజ్ ఎస్సై, రాపెల్లి రవి, గుజేటి రాము, దాచేపల్లి శ్రీనివాస్, భూమేశ్వర్, సుంకం రవి, ధర్మపురి విజయ, సులోచన బెన్నాజి, పసుపుల అరుంధతి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

## వాడి ప్రాథమిక పాఠశాలలో శానిటేషన్ బ్లాక్ ప్రారంభం



**చట్టం ధర్పల్లి:** ధర్పల్లి మండలం లోని వాడి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, శుక్రవారం ఐ ఏ హెచ్ వి, బ్లూ యాండర్, ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్మించిన, సానిటేషన్ బ్లాకును గ్రామ సర్పంచ్ కట్ట గంగమోహన్, ఫౌండేషన్ నిర్వాహకులు శుభం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిఏ. ప్రసన్నకుమార్,గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలలో శానిటేషన్ బ్లాక్ నిర్మించినందుకు ఫౌండేషన్ నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నవీన్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## వీర హనుమాన్ విజయ యాత్రకు ఆహ్వానం



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో ఈ నెల 31 మంగళవారం రోజున సాయంత్రం నాలుగు గంటలకి విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ వారి ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయ యాత్ర మహా పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని జంబి హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో దొండి రమణ, అల్జాపూర్ అక్షయ్, కత్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## 15 ఎకరాలలో ఇంటిగ్రేట్ బస్సు స్టాండ్, బస్సు డిపో



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో 15 ఎకరాలలో ఇంటిగ్రేట్ బస్సు స్టాండ్, బస్సు డిపో నిర్మించాలని అదే విధంగా ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట్ మండల బస్సు డిపో డిమాండ్ పరిష్కరించి డిపో ఏర్పాటు చేయాలని, అలాగే నందిపేట్ బస్సు స్టాండ్ ఆధునికరిచాలని నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించి అదనంగా ట్రిప్పులు పెంచాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్, ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి పోనం ప్రభాకర్ గౌడ్ సానుకులంగా స్పందించారని మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు అని తెలిపారు.

## సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**చట్టం గాంధారి:** గాంధారి మండలం రామలక్ష్మణ పల్లి గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మాట్లాడుతూ శ్రీరాముని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.

## శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో వైభవంగా సీతారాముల కళ్యాణం

**చట్టం / పరకాల :** పరకాల పట్టణంలోని 14వ వార్డులో ఉన్న అతి పురాతన పుణ్యక్షేత్రం శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది. ఈ కళ్యాణ మహోత్సవంలో 14వ వార్డు మాజీ కౌన్సిలర్ మార్క ఉమాదేవి రఘుపతి గౌడ్, 1వ వార్డు మాజీ కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని, భక్తి భావాన్ని మరింత బలపరుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



# అష్ట గ్రామంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

**చట్టం, ముధోల్ :**



నిర్మల్ జిల్లా ముధోల్ మండల పరిధిలోని అష్ట గ్రామంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీరామాలయంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక అభిషేకా, అలంకరణ పూజలు చేపట్టి అనంతరం మధ్యాహ్నం శ్రీరామ సీత కళ్యాణ వైభవం అంగరంగ వైభవంగా కొనసాగింది. రామాలయం వద్ద ఆధ్యాత్మిక శోభ వాతావరణం నెలకొంది. పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులు శ్రీరాముని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా సాగింది. పండితుల వేదమంత్రోచ్చారణల, మధ్య జరిగిన ఈ దివ్య కార్యక్రమం భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తింది. సమీప గ్రామాల నుండి కూడా భారీగా భక్తులు హాజరై కళ్యాణోత్సవాన్ని తిలకించారు. వేడుకలలో భాగంగా భజన మండళ్లు, హరిదాసుల కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించగా, వందలాది మంది పాల్గొని ప్రసాదం స్వీకరించారు. అదేవిధంగా రాత్రి 7 గంటలకు ఆదిలాబాద్ ఆర్కెస్ట్రా బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత కార్యక్రమం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. భక్తిగీతాలు, జానపద పాటలు, సినీ గీతాలతో కళాకారులు అందరినీ ఆకట్టుకున్నారు. ఈ వేడుకలను విజయవంతంగా నిర్వహించడంలో ప్రధాన అర్చకులు సునీల్, గంగా ప్రసాద్, కీలక పాత్ర పోషించారు. ప్రత్యేక పూజ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఆర్మూర్ సంతోష్ రెడ్డి, అష్ట గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్, ఉపసర్పంచ్ సురుగుల సావిత్ర కోటయ్య, పాల్గొని భక్తులతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ ఆర్మూర్ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ... "ఈ ఆలయాన్ని భద్రాద్రి రామాలయం మాదిరిగా అభివృద్ధి చేయడమే మా లక్ష్యం. భక్తులు అందరూ తరలి వచ్చి దర్శనం చేసుకునేలా ఆలయాన్ని మరింత విస్తరించి, అవసరమైన సౌకర్యాలను కల్పిస్తాము" అని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు అశోక్, సురుగుల పోశెట్టి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామస్వామి కళ్యాణ మహోత్సవాల్లో పాల్గొన్న ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్

**చట్టం ఆర్మూర్:**



శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్ వివిధ ప్రాంతాలలో నిర్వహించిన శ్రీ సీతారామస్వామి కళ్యాణ మహోత్సవాల్లో పాల్గొన్నారు.

**గోవింద్‌పేట్ లో..**

గ్రామంలోని శ్రీరామస్వామి ఆలయంలో జరిగిన సీతారామ కళ్యాణంలో పాల్గొని, శ్రీరాముని వ్యక్తిత్వం, తండ్రిపట్ల ఆయన చూపిన విధేయత, ప్రజల పట్ల ఆయన చేసిన సత్కార్యాల గురించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల గోవర్ధన్, నవీన్, రాజన్న, రమేష్, రవి, సర్పంచ్ అప్పాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

**గుత్ప గ్రామంలో..**

జరిగిన సీతారామ కళ్యాణంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దశరథ్, వీడీసీ చైర్మన్ నెహ్రూ, సురేష్, బాలయ్య, సంపత్ పంతులు పాల్గొన్నారు.

**మామిడిపల్లి గ్రామంలో..**

ఆలయ కమిటీ నిర్వహించిన సీతారామ కళ్యాణంలో పాల్గొని, భక్తులతో కలిసి అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. వీడీసీ సభ్యులు ఆయనను సన్మానించారు. *ఆర్మూర్ రామనగర్‌లో.* శ్రీరామాలయాన్ని సందర్శించి, అక్కడ నిర్వహించిన సీతారామ కళ్యాణం, పల్లకి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గుద్దేటి రమేష్, గంగమోహన్, చక్రు, రంగన్న, విఠోబా, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల ద్వారా శ్రీరాముని ఆదర్శాలను ప్రజల్లో వ్యాప్తి చేయాలని ఈరవత్రి రాజశేఖర్ పిలుపునిచ్చారు.

## ఇండస్ట్రీయల్ కారిడార్ పేరుతో భూ సేకరణపై రైతుల ఆగ్రహం

**1197 ఎకరాల సేకరణను ఆపాలని డిమాండ్**

**చట్టం వికారాబాద్ ప్రతినిధి :**



పరిగి మండలం రాపోల్, కాలాపూర్ గ్రామాల్లో ఇండస్ట్రీయల్ కారిడార్ పేరుతో ప్రభుత్వం చేపడుతున్న 1197 ఎకరాల భూ సేకరణపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ భూ సేకరణను వెంటనే నిలిపివేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ డిమాండ్ చేశారు. రైతులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అభివృద్ధి పేరుతో ప్రభుత్వం బలవంతపు మరియు మోసపూరితంగా భూములను సేకరిస్తోందని ఆరోపించారు. వికారాబాద్ జిల్లా ప్రజలు, పరిగి ప్రాంత రైతులు ఈ చర్యలను తీవ్రంగా ప్రతిఘటిస్తారని హెచ్చరించారు. ఇండస్ట్రీయల్ కారిడార్ కోసం బీడు భూములను తీసుకోవాల్సిందిపోయి, మూడు పంటలు పండించే సస్యశ్యామలమైన భూములను సేకరించడం రైతులకు అన్యాయం అని పేర్కొన్నారు. గతంలో రైతు వ్యతిరేక విధానాలు అవలంబించిన ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించారని, అదే విధానాలను కొనసాగిస్తే ప్రస్తుత ప్రభుత్వానికి కూడా రైతులు తగిన సమాధానం ఇస్తారని స్పష్టం చేశారు. రాపోల్, కాలాపూర్ గ్రామాల్లోని పేద రైతుల వ్యవసాయ భూములను సరైన సమాచారం ఇవ్వకుండా, వారి అభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా సేకరించడం పూర్తిగా అన్యాయమని విమర్శించారు. గతంలో పేదలకు భూములు పంచిన ప్రభుత్వం, ఇప్పుడు అదే పేద రైతుల భూములను తీసుకోవడం విచారకరమని అన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతుల అభిప్రాయం తీసుకోకుండా నోటిఫికేషన్ జారీ చేయడం చట్ట విరుద్ధమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ఈ భూ సేకరణను వెంటనే నిలిపివేయాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సుదర్శన్, సతీష్ పాల్గొన్నారు.

## స్థానికులకు మొండి చేయి చూపుతున్న గాయత్రి షుగర్స్ యాజమాన్యం



- **స్థానికుల కు ఒక తీరు-ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారికి అగ్ర తాంబూలం***
- **కిమ్మనని కంపెనీ లోని కార్మిక సంఘాలు**

**చట్టం ప్రతినిధి, కామారెడ్డి, మార్చ్ 27:**

కామారెడ్డి జిల్లాలోని గాయత్రి షుగర్స్ యజమాన్యం కార్మికుల పట్ల మొండి వైఖరిని అవలంబిస్తున్నట్లు కార్మికులు ఆరోపిస్తున్నారు. కార్మికుల రిటైర్మెంట్ లో సైతం స్థానికులకు ఒక తీరు ఇతర ప్రాంతాలకు చెందిన ఆంధ్ర కార్మికులకు మరో తీరు యజమాన్యం వ్యవహరిస్తుందని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం స్థలాలు ఇచ్చిన వారికి పని కల్పించిన యజమాన్యం రిటైర్మెంట్ విషయంలో కార్మికులకు మొండి చేయి చూపుతుంది. ఆంధ్ర ప్రాంతానికి చెందిన కార్మికులకు రిటైర్మెంట్ అయిన ఎలాంటి స్కిల్స్ లేకుండా విధుల్లో కొనసాగిస్తున్నారు. స్థానికులకు మాత్రం రిటైర్మెంట్ అయిన స్కిల్స్ ఉన్న కూడా వారిని పక్కన పెట్టి విధులు చేయకుండా అడ్డుకొని మొండి తనం చూపుతున్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యానికి, సానుకూలంగా ఉన్న కార్మికులకు మాత్రం రిటైర్ అయిన పని కల్పిస్తున్నారు. స్కిల్స్ ఉన్న కార్మికులకు మాత్రం మొండి చేయి చూపుతున్నారు. ఫ్యాక్టరీ ప్రారంభంలో సు సుమారు 450 మంది కార్మికులు పనిచేసేవారు. ప్రస్తుతం కేవలం 200 పై చిలుకు మంది కార్మికులు పనిచేస్తున్నారు. కార్మికులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. పీఎఫ్, ఈఎస్ఐ, సౌకర్యాలు కూడా సక్రమంగా కల్పించడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. ప్రశ్నించిన కార్మికులకు పనిష్మెంట్లు ఇస్తున్నారు. ఆంధ్ర కార్మికులకు ఒకరకం స్థానిక తెలంగాణ కార్మికులకు ఒకరకంగా ఫ్యాక్టరీ అధికారులు పనిచేస్తున్నారని దీంతో స్థానిక కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీలో ఉన్న కార్మిక సంఘాల్లో ప్రతినిధులు సైతం ఫ్యాక్టరీ యజమాన్యంతో కుమ్మక్కై కార్మికుల సమస్యలను పట్టించుకోవడంలేదని పలువురు కార్మికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆంధ్ర, తెలంగాణ, ప్రాంత విభేదాలు విడిచిపెట్టి స్కిల్స్ ఉన్న కార్మికులకు పని కల్పించాలని కార్మికుల కోరుతున్నారు. స్థానిక కార్మికులకు ఫ్యాక్టరీ యజమాన్యం డ్యూటీలు వేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించిన కార్మికులకు పని భారం ఎక్కువ మోపుతున్నారని కార్మికులు పేర్కొన్నారు. ఇప్పటికైనా గాయత్రి షుగర్ స్ యజమాన్యం స్పందించి స్థానిక కార్మికులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

## ఘనంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం



**చట్టం గాంధారి:** గాంధారి మండల కేంద్రంలోని శ్రీరామ నవమి శుభ సందర్భంగా మండల కేంద్రంలోని ఘనంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు జాజల సురేందర్ ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తో పాటు మండల కేంద్రంలోని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగరంగవైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం







**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ నవనాథ సిద్దగుట్ట పైన శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణం అత్యంత మనోహరంగా అంగరంగవైభవంగా ఎంతో భక్తి శ్రద్ధతో వేద పండితులు వేదాంతం గోపికృష్ణ శర్మ, వేదమంత్రోత్సవాల మధ్య కమనీయం రమనీయంగా కళ్యాణం నిర్వహించారు. ఈ కళ్యాణానికి లక్షకు పైగా భక్తులు తరలివచ్చి ఆ స్వామివారి ఆ సీతారాముల కళ్యాహోత్సవం తిలకించి స్వామివారి అన్నప్రసాదం తీసుకన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి, ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. పలుగుట్ట శ్రీ కేదారేశ్వర స్వామీజీ మంగి మహారాజ్ స్వామీజీ, విచ్చేసి స్వామివారికి తలంబ్రాలు సమర్పించుకొని, పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని మహారాజ్ ఆధ్వర్యంలో యాజ్ఞ సంపూర్ణ స్వీకారం పూర్తయింది. దాదాపు ఒక లక్ష పైగా భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సిద్దులగుట్ట సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీసీతరాముల కళ్యాణమహోత్సవం



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గల శ్రీనాగ లింగేశ్వర ఆలయంలో శ్రీ రామనవమి సందర్భంగా శుక్రవారం రోజు ఘనంగా శ్రీసీతారాముల కళ్యాణమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పెళ్లి పెద్దలుగా ప్రశాంత్, యాదగిరి గౌడ్ ల దంపతులు కన్యాదానం నిర్వహించారు. దాదాపు పది వేల మంది భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆర్మూర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ పి.సత్యనారాయణ గౌడ్, ట్రాఫిక్ కంట్రోల్ చేస్తూ, అన్నదానం చేసి భక్తులకు ఇబ్బంది కలుగకుండా చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సత్య శ్రీనివాస్, కలిగోట గంగాధర్, రెడ్డి ప్రకాష్, బాలోజీ, అంబికా రమేష్, రాజయ్య, అజయ్, వెంకట రమణ, నారాయణ, విజయ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరామనవమి ఉత్సవాలు



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో గల హనుమాన్ మందిరం వద్ద శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం రోజు గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, మీనుగు నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా శ్రీసీతారాముల కళ్యాణం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. శ్రీసీతారాముల కళ్యాణం పూజా కార్యక్రమాలు గ్రామ పురోహితుడు, కిరణ్ కుమార్ జ్యోషి వేదమంత్రోత్సవాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గ్రామ ప్రజలందరికీ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మీనుగు నాగరాజు వారి బృందం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు, గ్రామ సర్పంచ్ సారంగి శాంతి కుమార్, ఉప సర్పంచ్ ప్రముఖ న్యాయవాది సింధూకర్ చరణ్, గ్రామ వార్డు సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి సురకంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సూరినీడ దశరథ్, ముఖ్య సలహాదారుడు సొక్కం సంజీవ్, కోశాధికారి శ్రీనివాస్, సలహాదారుడు కంపదండి సాయన్న, సభ్యులు బట్టు సురేష్, పట్నం నడిపి లింగన్న, అగల్ దివిటీ పున్ని తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య సేవలకు చివరి గౌరవం... ప్రజాప్రతినిధుల సహాయం

**చట్టం / ఎల్లారెడ్డి :** మండలంలోని వెల్లుట్లపేట గ్రామానికి గతంలో పారిశుద్ధ్య కార్మికురాలుగా సేవలందించిన వడ్డే రాజవ్వ మరణంతో వెల్లుట్లపేట గ్రామం విషాదంలో మునిగిపోయింది. జీవితాంతం గ్రామ శుభ్రత కోసం కష్టపడిన ఆమెకు చివరి ఘన నివాళిగా గ్రామ ప్రజాప్రతినిధులు మానవత్వాన్ని చాటారు. రాజవ్వ అంత్యక్రియల కోసం అవసరమైన ఆర్థిక సహాయాన్ని గ్రామ సర్పంచ్ కొయ్యల వినోద రాజా గౌడ్, ఉప సర్పంచ్ కర్రి చెవుల రాజు యాదవ్, వార్డు సభ్యులు గాండ్ల సాయిరాం, మాజీ వార్డు సభ్యులు కొట్టాల బాలాజీ కలిసి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సహాయం ద్వారా గ్రామానికి సేవ చేసిన కార్మికురాలిపై తమ గౌరవాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రాజవ్వ సేవలను స్మరించుకుంటూ ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేశారు. సేవే ధర్మంగా భావించిన రాజవ్వ జీవితానికి ఇది నిజమైన గౌరవాంజలి అని పలువురు అభిప్రాయపడ్డారు.



# భక్తి, ఐక్యతల సందడి... చింతకుంటలో సీతారాముల కల్యాణం వైభవం

**మహా అన్నదానంతో గ్రామం ఒక్కటైంది**

**చట్టం న్యూస్ మోస్రా :**



నిజామాబాద్ జిల్లా మోస్రా మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం అపూర్వ భక్తి, ఆధ్యాత్మిక ఉత్సాహం నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామ సర్పంచ్ వంగ నీలిమ సాయ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవం గ్రామ ప్రజలందరినీ ఒక్క తాటిపైకి తెచ్చిన ఆధ్యాత్మిక వేడుకగా నిలిచింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా జరిగిన సీతారాముల కల్యాణం ప్రతి భక్తుని మనసును హత్తుకుంది. ఆలయ ప్రాంగణం పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించబడగా, పండుగ వాతావరణం నెలకొంది. భక్తజనాలతో నిండిపోయిన ఆలయం నిండా "జై శ్రీరామ్" నినాదాలు మారుమ్రోగాయి. కల్యాణ వేడుకలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వంగ నీలిమ సాయ గౌడ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఐక్యత, సంప్రదాయాల పరిరక్షణ కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ కలిసి పాల్గొనడం ద్వారా సామరస్య వాతావరణం ఏర్పడిందని తెలిపారు. కల్యాణ మహోత్సవం అనంతరం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. వందలాది మంది భక్తులు, గ్రామస్తులు అన్నదానంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. సేవా భావంతో గ్రామ యువకులు, మహిళలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భక్తులకు భోజనం వడ్డించడం కార్యక్రమానికి మరింత శోభను తీసుకొచ్చింది. ఈ వేడుకలో ముఖ్యంగా కులమత భేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా పాల్గొనడం విశేషం. చిన్నా పెద్దా తేడా లేకుండా గ్రామ ప్రజలు ఒక్కటై సీతారాముల ఆశీస్సులు పొందడం గ్రామంలో ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ఇది సమాజానికి ఆదర్శంగా నిలిచే సంఘటనగా పలువురు పేర్కొన్నారు. గ్రామ పెద్దలు, యువత, మహిళలు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ప్రత్యేకంగా ప్రశంసించబడింది. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు కూడా నిర్వహించడంతో ఆధ్యాత్మిక వాతావరణం మరింత ఉత్సాహంగా మారింది. ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు గ్రామంలో భక్తి భావాన్ని పెంపొందించడమే కాకుండా, మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. చింతకుంటలో నిర్వహించిన ఈ సీతారాముల కల్యాణ మహోత్సవం గ్రామ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతుందని అందరూ అభిప్రాయపడ్డారు అనంతరం గ్రామంలో ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మెదక్‌లో వైభవంగా సీతారాముల కళ్యాణం

**మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మదేవేందర్ రెడ్డి దంపతులు**





**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం భక్తుల జయజయధ్వానాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ వైభవంగా జరిగింది. ఆలయ పూజారి ఆధ్వర్యంలో వేదపండితులు అభిజిత్ లగ్నంలో సంప్రదాయబద్ధంగా కళ్యాణ తంతును నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి కళ్యాణంలో పాల్గొన్నారు. ఉదయం 11:00 గంటలకు సీతారాములను పల్లకీలో తీసుకువచ్చి మండపంలో ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో కళ్యాణం నిర్వహించారు. సుమారు రెండు గంటల పాటు సాగిన ఈ తంతును భక్తులు ఆనందభరితంగా వీక్షించారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మెదక్ జిల్లా ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముని ఆశీస్సులు రాష్ట్రంపై ఉండాలని ఆకాంక్షిస్తూ, ఆయన గుణగణాలను అందరూ అలవర్చుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ప్రభుత్వం పేద ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ. ఆంజనేయులు, కౌన్సిలర్లు మాయ గంగామణి మల్లేశం, కొట్టాల. లలితమ్మ విశ్వం,పట్టణ పార్టీ కన్వీనర్ గడ్డమీద కృష్ణ గౌడ్, న్యాయవాది జీవన్ రావు, మాజీ కౌన్సిలర్లు ఆర్కే.శ్రీనివాస్, మాయ మల్లేశం, బిఆర్ఎస్ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గంటలోనే 9 తులాల బంగారం రికవరీ



**చట్టం, తూప్రాన్:** మెదక్ జిల్లా తూప్రాన్ పోలీసులు చురుకైన చర్యలతో కేవలం గంట వ్యవధిలోనే సుమారు 9 తులాల బంగారం రికవరీ చేయడం విశేషం. ఈరోజు ఉదయం డయల్ 100కు అందిన సమాచారం మేరకు, బ్రాహ్మణపల్లి రైల్వే గేట్ సమీపంలో ఒక వ్యక్తి తన బ్యాగ్‌ను కోల్పోయినట్లు, అందులో సుమారు 9 తులాల బంగారం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. వెంటనే స్పందించిన తూప్రాన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. ప్రాథమిక విచారణలో, ఫిర్యాదుదారు మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తూ బ్యాగ్‌ను సైడ్ హ్యాండిల్‌కు వేలాడదీసి తీసుకెళ్తుండగా, అది ప్రమాదవశాత్తు కింద పడి పోయినట్లు తెలిసింది. పోలీసులు వెంటనే పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. ఆ క్రమంలో బ్యాగ్ ఒక స్పీడ్ బ్రేకర్ వద్ద పడిపోయి, అక్కడి నుంచి ఒక వ్యక్తి దాన్ని తీసుకెళ్లినట్లు గుర్తించారు. తక్షణమే ఆ వ్యక్తిని గుర్తించిన పోలీసులు అతని వద్దకు చేరుకోగా, అతను తన వద్ద బ్యాగ్ ఉన్నట్లు స్వయంగా తెలిపాడు. పరిశీలించగా అందులో ఉన్న రెండు బంగారు చైన్‌లు (సుమారు 9 తులాలు)ను స్వాధీనం చేసుకుని యజమానికి అప్పగించారు. పోలీసుల వేగవంతమైన చర్యలతో కేవలం ఒక గంటలోనే మొత్తం ఆస్తి రికవరీ కావడం విశేషం. ఈ సందర్భంగా తూప్రాన్ డీఎస్పీ పోలీసు సిబ్బందిని అభినందించారు.అలాగే నిజాయితీగా బంగారం అప్పగించిన నాగరాజు, కృష్ణలను శాలువాలతో సన్మానించారు.

## శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న కార్తీక్ రెడ్డి



**చట్టం, శంషాబాద్ :** శ్రీరామ నవమి సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, చిన్నగోల్కొండ, తొండుపల్లి, నానాజీపూర్, అమ్మపల్లి, అర్బానగర్, శాతం రాయి లో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ... ధర్మాన్ని స్థాపించడానికి శ్రీరాముడు చేసిన త్యాగం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. సమాజంలో న్యాయం, సత్యం, ధర్మం నిలవాలంటే ప్రతి ఒక్కరూ శ్రీరాముడి మార్గాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ప్రతి గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. అలాగే ఈ పవిత్రమైన రోజు అందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచర్ల శ్రీనివాస్, శంషాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు కోలన్ ప్రదీప్ రెడ్డి, దేవరంపల్లి బుచ్చిరెడ్డి, చిన్నగండు రాజేందర్, మంచర్ల మోహన్ రావు, కోణమొల్ల శ్రీనివాస్, మల్లేష్ ముదిరాజ్, మాడపాటి పరమేశ్వరి నరేందర్, వీరమల్ల హన్మంత్ ముదిరాజ్, రాచమల్ల జయసింహ, మురళి గౌడ్, పెట్రోల్ సాయి గౌడ్, గుంటి చరణ్, పరందములు, రమేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## అభంగపట్నం విడిసి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం



**చట్టం నవీపేట్ :** మండలంలోని అభంగపట్నం రామాలయంలో గ్రామ విడిసి ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇట్టి కల్యాణాన్ని గోపూరు నరేష్ రెడ్డి మరియు పండ్ల శ్రీనివాస్ దంపతుల చేతుల మీదుగా నిర్వహించారు. అనంతరం రామాలయంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీడీసీ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి, గ్రామ సర్పంచ్ గని వసంత సతీష్, మాజీ సొసైటీ చైర్మన్ నేల కంటి అబ్బన్న, మరియు విడిసి కార్యవర్గ సభ్యులు, భక్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారాముల కళ్యాణం... కమనీయం

**కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మంత్రి వివేక్ దంపతులు**

**చట్టం రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ శ్రీరాంబట్ల శశాంక్ శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు పనిభట్ల అంబా ప్రసాద్ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు చెన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి సరోజ దంపతులు, మందమర్రి జనరల్ మేనేజర్ శ్రీవాణి రాధాకృష్ణ దంపతులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి వార్లను దర్శించుకున్నారు. కళ్యాణాన్ని తిలకించేందుకు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. శెట్టి బలజీ(గౌడ)సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. సాయంత్రం 8 గంటల వరకు శ్రీరామచంద్ర మూర్తులను దర్శించుకున్నారు. మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ పర్శ రమేష్, జాడి శ్రీధర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



**10 వేల మంది భక్తులకు మహా అన్న ప్రసాద వితరణ**

శ్రీ కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం మహోత్సవంలో భాగంగా ఏర్పాటుచేసిన మహా అన్నదాన కార్యక్రమానికి చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ రాణి అలెఖ్య దంపతులు 2 రెండు లక్షల రూపాయలు విరాళంగా అందజేసి అన్నప్రసాద దాతగా నిలిచారు. దింతో పదివేల మంది భక్తులకు మహా అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మహిళలకు, పురుషులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రతి ఒక్క భక్తునికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టి సాయంత్రం 8 గంటల వరకు కొనసాగించి భక్తుల మనసును దోచుకున్నారు. ఈ అన్న ప్రసాద వితరణ ఏర్పాట్లను కంభగోని సుదర్శన్ గౌడ్ బృందం టీం వర్క్ చేసి పెద్ద ఎత్తున విజయవంతం చేశారు.

## కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి

చట్టం ప్రతినిధి కామారెడ్డి : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ మండల పార్టీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## శ్యామ్ గడ్ హత్య కేసు ఛేదించిన నిర్మల్ టౌన్ పోలీసుల

**చట్టం, నిర్మల్ ప్రతినిధి :**



నిర్మల్ జిల్లా కేంద్రంలో 24032026 మంగళవారం రోజున శ్యామ్ గడ్ సమీపంలోని కోట వెనుక ప్రాంతంలో జరిగిన హత్య కేసును నిర్మల్ టౌన్ పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఆదేశాల మేరకు, ఏఎస్పీ సాయి కిరణ్ పర్యవేక్షణలో పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. కేసు వివరాల ప్రకారం, నిందితులు గుపాల్వాడ్ శ్రీనివాస్, వెంకటేష్, రాజు మరియు మృతుడు గజానంద్ ఒక మహిళతో అక్రమ సంబంధాలు కొనసాగించారు. ఈ విషయం బయటపడటంతో మృతుడు గజానంద్ తరచూ ఇతరులతో గొడవలకు దిగేవాడు. ఈ వివాదం కారణంగా నిందితులు కలిసి కుట్ర పన్ని మృతుడికి మద్యం తాగించి, శ్యామ్ గడ్ సమీపంలోని కోట వెనుక ప్రాంతానికి తీసుకెళ్లి కట్టెలతో, బీరు సీసాలతో దాడి చేసి హత్య చేశారు. అనంతరం శవాన్ని నీటి గుంతలో పడవేసి పరారయ్యారు. ఈ ఘటనపై 25032026న మృతుడి బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు తిరుమల, గుపాల్వాడ్ శ్రీనివాస్‌లను అరెస్ట్ చేశారు. వెంకటేష్, రాజు పరారీలో ఉండగా, వారిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సాయి కిరణ్ మాట్లాడుతూ హత్య వంటి ఘోర నేరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, నిందితులు ఎంతవరకు దాగినా చట్టం నుండి తప్పించుకోలేరని పేర్కొన్నారు. ప్రజలు చిన్నచిన్న వివాదాలను హింసాత్మక మార్గాల్లో పరిష్కరించుకోవడం వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, సమస్యలను చట్టబద్ధ మార్గాల్లోనే పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కేసు ఛేదనలో పాల్గొన్న ఇన్‌స్పెక్టర్లు కృష్ణ, సమ్మయ్య, ఎస్ఐ సుమాంజలి మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

## రంగ రంగ వైభవంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం



**చట్టం న్యూస్ లింగంపేట్ :**

శ్రీరామనవమిని పురస్కరించుకొని మండలంలో శుక్రవారం ఆయా గ్రామాల్లో బృందం గ్రామస్తులు కన్నుల పండుగగ వైభవోపేతంగా శ్రీరామచంద్రుని కళ్యాణం మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని లింగంపేట్, పోల్కంపేట్, బానాపూర్ మోతే తదితర గ్రామాల్లో కన్నుల పండుగగా శ్రీ సీతారాముల కళ్యాణం జరిగింది. సందర్భంగా భక్తులు ఉదయం నుండి ఆయా ఆలయాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వందలాది గ్రామస్తుల సమక్షంలో ముత్యాల పందిరిలో దేదీప్యమానంగా ముస్తాబైన వరుడు శ్రీరామునికి, జనకుని పుత్రిక అయిన సీతమ్మ వారికి కళ్యాణం కమనీయంగా జరిపించారు. శ్రీరామరామి వేడుకను పురస్కరించుకుని మండలంలోని పోల్కంపేట్ గ్రామంలోని హరిహర గోపాలస్వామి దేవాలయంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలకు ఆలయ అర్చకులు ఛత్రం త్రిక్రమాచారి చే వేద మంత్రోత్సరణతో ప్రత్యేక పూజలు కళ్యాణం జరిపించారు. అమ్మవారికి భక్తులు ఓడి బియ్యం సమర్పించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్న అన్న ప్రసాద వితరణ చేశారు. అన్నదానంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దివిటి రమేష్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, నీటిపారుదల శాఖ మాజీ చైర్మన్ వెంకటరెడ్డి మాజీ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఉపసర్పంచ్ ఛత్రం రామానుజాచారి, వార్డు సభ్యులు చంద్రయ్య, శ్రీనివాస్, సాయిలు, తో పాటు గ్రామస్తులు బండ మహేష్, రామలింగం, రాజు, సాయిలు, వెంకటేశం, రమేష్,సుభాన్ రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశం, అభిషేక్, సాయిలు, దుర్గయ్య, భీమయ్య, సత్యం తో పాటు పెద్ద సంఖ్యలో యువకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వరికోల్‌లో వైభవంగా ప్రారంభోత్సవాలు





**చట్టం/ పరకాల**

నడికూడ మండలంలోని వరికోల్ గ్రామంలో శుక్రవారం ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవం, శివాజీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మరెడ్డి, రైతు రుణ విమోచన మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమాలను ప్రారంభించారు. శ్రీరామ నవమి సందర్భంగా గ్రామంలో శ్రీ సీతారాముల కళ్యాణాన్ని అర్చకుల వేదమంత్రాల మధ్య వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజల దీర్ఘకాల స్వప్నమైన ఎస్ఆర్ఎల్ నూతన ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించారు. ఈ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి అందించిన సహకారాన్ని గ్రామస్తులు అభినందించారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. సీతారాముల కళ్యాణం అనంతరం మహా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొగ్గేల కుమారస్వామి, మాజీ వైస్ ఎంపీపీ చందా కుమారస్వామి, ఉపసర్పంచ్ మురాల భుజంగరావు, బీఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు పోశాల అశోక్ గౌడ్, వార్డు సభ్యులు పిట్ట మల్లేష్, నేరెళ్ల కరుణాకర్, పర్శ ఎల్లస్వామి, గజ్జి తిరుపతి, కురుమిల్ల శ్రీనివాస్, పర్శ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## 525 మందికి జరిమానాలు శిక్షలు, 56 మందికి జైలు

**చట్టం ప్రతినిధి కామారెడ్డి**



కామారెడ్డి జిల్లాలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 525 మందికి కోర్టు శిక్షలు విధించినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. వీరిలో 56 మందికి జైలు శిక్ష పడగా, అందరికీ కలిపి రూ. 4,92,400 జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనం నడపడం ఆత్మహత్యా సదృశ్యమని, మీ కుటుంబ క్షేమం కోసం నిబంధనలు పాటించాలని ఎస్పీ హెచ్చరించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## ఘనంగా శ్రీరామనవమి వేడుకలు – సీతారాముల కల్యాణానికి భారీగా ప్రజల రాక



**చట్టం / నిజామాబాద్ ప్రతినిధి :** అత్యంత పవిత్రమైన పండుగలలో ఒకటైన శ్రీరామనవమి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా భక్తి వాతావరణం నెలకొంది. చైత్ర మాసం శుక్ల పక్ష నవమి రోజున జరుపుకునే ఈ పర్వదినం రాముడి జన్మదినంగా భావిస్తూ భక్తులు ఘనంగా నిర్వహించారు. ధర్మం, నిజాయితీ, న్యాయం వంటి విలువలకు ప్రతీకగా నిలిచిన రాముడి జీవితం ప్రజలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఎడపల్లి మండలంలోని తనకాలన్ గ్రామంలో నిర్వహించిన సీతారాముల కల్యాణం విశేషంగా ఆకట్టుకుంది. గ్రామ ప్రజలు, మాలధారణ చేసిన భక్తులు భారీగా తరలివచ్చి వేడుకలను ప్రత్యక్షంగా వీక్షించారు. కల్యాణ మండపంలో పండితుల ఆధ్వర్యంలో కీర్తనలు, రామాయణ పారాయణాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గతంలో విగ్రహాలు లేకపోవడంతో, గ్రామానికి చెందిన పసుల లింగారెడ్డి సీతారాముల విగ్రహాలను ఏర్పాటు చేయగా, అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ వేడుకను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా లింగారెడ్డి మాట్లాడుతూ రాముడి జీవితం ప్రతి మనిషికి ఆదర్శమని, కుటుంబ విలువలు, రాజధర్మం, నిబద్ధత వంటి లక్షణాలు సమాజానికి మార్గదర్శకాలని తెలిపారు. అలాగే సర్పంచ్ అలేఖ్య శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీరామనవమి ధర్మం, న్యాయం, ప్రేమ, త్యాగం వంటి విలువలను గుర్తు చేస్తుందని, ప్రతి ఒక్కరూ ఆ విలువలను అనుసరించాలని సూచించారు. ఈ వేడుకల్లో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణాన్ని జరుపుకున్నారు.

## పిసిసి అధ్యక్షున్నీ సన్మానించిన కౌన్సిలర్



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం రోజు శ్రీరామనవమి సందర్భంగా తెలంగాణ పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ని మర్యాదపూర్వం కలిసి సన్మానించిన ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పెర్కిట్ ఆరవ వార్డు కౌన్సిలర్ షేర్ల మమత గంగులి గౌడ్, వెంకట్ గౌడ్, సాయినాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి నూతన శక్తి – ఎమ్మెల్యేకు గౌరవ సత్కారం



**చట్టం/ ఎల్లారెడ్డి :** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని నూతన జిల్లా ఉపాధ్యక్షుడు మంచిర్యాల విద్యాసాగర్ స్పష్టం చేశారు. కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావును విద్యాసాగర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, కౌన్సిలర్ ఎరుకల దశరథం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి జిల్లా ఉపాధ్యక్ష పదవి అప్పగించిన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే తన లక్ష్యమని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని అన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే జిల్లా అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మాట్లాడుతూ... పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. అందరూ ఐక్యంగా పనిచేసి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు విద్యాసాగర్, మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, 12వ వార్డు కౌన్సిలర్ ఎరుకల దశరథం, నాయకులు తమ్మల శ్యామ్, పప్పు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం

**పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్**



**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ధరూర్ మండలం కేరెల్లి గ్రామంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా సాగింది. గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో జరిగిన ఈ వేడుకలకు గ్రామ ప్రజలు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భజన మండలి సభ్యులు భక్తి గీతాలు ఆలపిస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు కోరుకున్నారు. గ్రామమంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, సదానంద్ రెడ్డి, ధరూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ పద్మమ్మ రాములు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అలాగే వికారాబాద్ పట్టణంలోని శివారెడ్డి పేట్ మల్లికార్జున స్వామి ఆలయంలో జరిగిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలో కూడా డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీరాముని కృపతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో BRS పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మండలంలో వైభవంగా శ్రీరామనవమి వేడుకలు



**చట్టం ధర్పల్లి:** ధర్పల్లి మండలంలో శుక్రవారం శ్రీరామనవమై వేడుకలు మండల ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంలోని దళితవాడలో గల శ్రీరామాలయంలో సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఉత్సవ విగ్రహాలను గ్రామంలో హనుమాన్ భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. కళ్యాణ అనంతరం భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం చేశారు. సాయంత్రం గ్రామంలో పురవీధుల్లో పల్లకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తులు విశేష సేవలు అందించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. వేద పండితులు జగన్ శర్మ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు కళ్యాణం అత్యంత వైభవంగా జరిగాయి. భారీగా మండల ప్రజలు హాజరై సీతారాముల కళ్యాణాన్ని వీక్షించారు . మండలాల్లోని వైష్ణవ ఆలయాలని శ్రీ సీతరామ నామస్మరణతో మరుమోగాయి.

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

# నిర్మల్ జిల్లాలో అంగరంగ వైభవంగా శ్రీరామనవమి ఉత్సవాలు



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :**

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా శ్రీరామనవమి ఉత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంతో పాటు ఖానాపూర్, కడెం, దస్తురాబాద్, లక్ష్మణచందా, సోన్, సారంగాపూర్, దిల్వార్పూర్, నర్సాపూర్, కుంటాల, కుబీర్, లోకేశ్వరం, భైంసా, తానూర్, ముధోల్, బాసర మండలాల్లోని గ్రామాల్లో భక్తులు భారీగా పాల్గొన్నారు. నిర్మల్ పట్టణంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి హిందూ వాహిని సభ్యులతో కలిసి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న భక్తులు నృత్యాలు చేస్తూ జైశ్రీరామ్ నినాదాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలయాల్లో వేకువజామున అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి అనంతరం సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రసాదాలను పంపిణీ చేశారు. భజనలు, ఆటపాటలు, నృత్యాలతో ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగాయి. మహిళలు మంగళహారతులతో ర్యాలీల్లో పాల్గొని సమదుస్తులతో భక్తి పారవశ్యాన్ని వ్యక్తం చేశారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు శాఖ విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసింది. జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల పర్యవేక్షణలో కీలక ప్రాంతాల్లో పోలీసు బలగాలు మోహరించి, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం నిఘా కొనసాగించారు. ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించబడినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో హిందూ వాహిని ఉత్సవ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, యువత, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సెల్ ఫోన్ దొంగల ముఠా గుట్టురట్టు – 25 ఖరీదైన మొబైళ్లు స్వాధీనం



**చట్టం వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లాలో రద్దీగా ఉండే కూరగాయల మార్కెట్ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని సెల్ ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. జిల్లా సీసీఎస్ పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సీసీటీవీ ఫుటేజ్, టెక్నికల్ ఆధారాల ఆధారంగా నిందితుల కదలికలను గుర్తించారు. దర్యాప్తులో భాగంగా కర్నూలు జిల్లా డోన్ మండలానికి చెందిన కె. రవి అలియాస్ గౌరిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతను మరో ఐదుగురు పెద్దవారు, ముగ్గురు మైనర్ బాలుర సహాయంతో వికారాబాద్, బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రద్దీ ప్రాంతాలలో దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడు. ముఠా సభ్యులు ఆటోలు, బైక్‌లపై తిరుగుతూ ప్రజలు అప్రమత్తంగా లేని సమయంలో మైనర్ల ద్వారా సెల్ ఫోన్లు దొంగిలించి వెంటనే ఒకరి నుంచి మరొకరికి మార్చడం ద్వారా ఆధారాలు లేకుండా చేసేవారు. పోలీసులు నిందితులు అద్దెకు తీసుకున్న నివాసంలో సోదాలు నిర్వహించి సుమారు 3,75,000 రూపాయల విలువ గల 25 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కె. రవి అలియాస్ గౌరి, బి. మహేష్, ఆకుల కార్తీక్, వడ్డే మురళి, వడ్డే వెంకటేష్, సంపంగి తిరుపతి నిందితులుగా గుర్తించారు. పోలీసులు ప్రజలకు రద్దీ ప్రదేశాల్లో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులను గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సెల్ ఫోన్ దొంగతనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కేసు ఛేదనలో పాల్గొన్న సీసీఎస్, వికారాబాద్ పోలీస్ సిబ్బందిని అధికారులు అభినందించారు.

## పట్టు వస్త్రాలు సమర్పించిన మున్సిపల్ చైర్మన్ సీమ రమేష్ సెట్



**చట్టం బిచ్కుంద :** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం బిచ్కుంద మున్సిపాలిటీలో శ్రీరామ నవమి సందర్భంగా శ్రీరామ మందిరం రాములోరి కి బిచ్కుంద మున్సిపల్ చైర్మన్ సీమ రమేష్ సెట్ రాములవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు, ప్రతి ఏడాది ధర్మ జాగరణ ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు సమర్పించడము ఆనవాయితీగా వస్తుంది, లో గల హనుమాన్ మందిర్ ఆలయంలో భాజ భజంత్రీలతో పాటు వస్త్రాలను తీసుకొని వచ్చి శ్రీరామ్ కి సమర్పిస్తారు , ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగాధర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు విఠల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయిల్ సెట్ కార్ మున్సిపల్ కౌన్సిలర్ భాగ్యలక్ష్మి ప్రేమ్ సెట్ అనిల్ డాక్టర్ నరసింహులు హనుమాన్లు నాగరాజ్ గణేష్ గౌండ దత్తు పంతుల్ మాజీ జెడ్పిటిసి నాగనాథ్ సుచిత్ సంజు పటేల్ వికాస్ మైనార్టీ నాయకులు ఖలీల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## ఏదుల్లపల్లి గ్రామంలో యువకుడి ఆత్మహత్య



**చట్టం వెల్దుర్తి :** వెల్దుర్తి మండల పరిధిలోని ఏదుల్లపల్లి గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది గ్రామానికి చెందిన దాసరి విజయ్ (24) కు గత కొద్ది రోజుల క్రితం పెళ్లి సంబంధం కుదిరి నిశ్చితార్థం జరిగింది. అనివార్య కారణాలవల్ల పెళ్లి నిలిచిపోవడంతో తీవ్ర విషాదానికి గురైన విజయ్ గురువారం తన వ్యవసాయ క్షేత్రం వద్ద పురుగుల మందు త్రాగాడు విషయం తెలుసుకున్న గ్రామస్తులు కుటుంబుకులు విజయ్ ని చికిత్స నిమిత్తం మెదక్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం గురించి హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించారు. హైదరాబాద్ లోని ఓ కార్పొరేట్ హాస్పిటల్ తీసుకెళ్లారు. హాస్పిటల్ లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు మృతుడికి తల్లిదండ్రులు శ్రీహరి సుగుణ సోదరుడు శ్రీకాంత్ ఉన్నారు. మృతుడి తల్లిదండ్రులు బంధువులు స్నేహితులు బోరున విలపించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఆరవ వార్డులో నూతన బోరు బావిలో మోటరు బిగించిన సర్పంచ్



**చట్టం జుక్కల్ :** కామారెడ్డి జిల్లా జుక్కల్ మండల కేంద్రంలోని 6వ వార్డులో నీటి సమస్య ఉన్నందున అ వార్డులో నూతన బోరుబావి వేయించి నూతన బోరు మోటర్ బిగించడం వల్ల కాలనీలో నీటి సమస్య తీరినట్లు ప్రజలు చెప్తున్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ సర్పంచ్ భర్త మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయ గౌడ్ వార్డ్ మెంబర్ చంద్రకళ లక్ష్మణ్ గ్రామ పెద్దలు భూమయ్య మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## లింగారెడ్డిపేటలో ఘనంగా సీతారాముల కళ్యాణం

**ఆరుగురు వేదపండితుల మంత్రోత్సరణల మధ్య వైభవోపేతంగా కల్యాణం**



**చట్టం, తూప్రాన్:** లింగారెడ్డిపేట గ్రామంలో శుక్రవారం రాత్రి మాల ధారణ చేసిన హనుమాన్ భక్తుల ఆధ్వర్యంలో శ్రీ సీతా రాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. దేవత మూర్తుల విగ్రహాలను ప్రత్యేకంగా అలకరించిన ట్రాక్టర్ పై డప్పుచప్పుల్తతో ఊరేగింపుగా కళ్యాణ మండపానికి తీసుకొచ్చారు. పురోహితులు వేద మంత్రోత్సరణలతో వైభవంగా కళ్యాణ ఉత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహించారు. ఈ మహోత్సవంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళ్యాణ ఉత్సవాన్ని కనులార వీక్షించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం పెద్ద ఎత్తున కొనసాగింది. ఈ ఉత్సవంలో హనుమాన్ భక్తుడు ప్రభాకర్ గుప్త తో పాటు బీ ఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత శ్రీనివాస్ గౌడ్, శంకరగోని సురేష్ గౌడ్, బామని ప్రవీణ్ యాదవ్, ఉప సర్పంచ్ మన్నే లక్ష్మీ వెంకటేశం, మాజీ ఉప సర్పంచ్ వావిలాల వెంకటేశం గుప్తా, వడ్ల వెంకట్ చారి, హనుమాన్ మలాధారణ స్వాములు దయాకర్ గౌడ్, ఆకాష్, చంద్ర శేఖర్ గౌడ్, మన్నే నర్సింగ రావు, పిట్ల దశరథ మరియు వివిధ గ్రామాల నుంచి వచ్చిన హనుమాన్ స్వాములు లింగారెడ్డి పేట గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యునిపై దాడి ఘటనలో నిందితులపై కఠిన చర్యలు



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యునిపై గురువారం చోటుచేసుకున్న దాడి ఘటనను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తీవ్రంగా ఖండించారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. శుక్రవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేస్తూ, ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడానికి వీల్లేదని హెచ్చరించారు. అరాచకానికి పాల్పడే వారిపై నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తామని తెలిపారు. ఈ ఘటనపై ఇప్పటికే పూర్తిస్థాయి విచారణ కొనసాగుతోందని, బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఘటన నేపథ్యంలో జిల్లాలో వైద్య సేవలకు ఎటువంటి అంతరాయం కలగలేదని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు యథావిధిగా పనిచేస్తున్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సాధారణ ఓపీ సేవలతో పాటు అత్యవసర వైద్య సేవలు కూడా నిరంతరాయంగా కొనసాగుతున్నాయని వివరించారు. ప్రజారోగ్యానికి భంగం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, వైద్యులకు రక్షణ కల్పించడంతో పాటు శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు.

## కౌలాస్ నాలా ప్రాజెక్టులో పడి వ్యక్తి ఆత్మహత్య



**చట్టం జుక్కల్ :** కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలోని వజ్రఖండి గ్రామ శివారు కౌలాస్ నాలా ప్రాజెక్టు బ్యాక్ వాటర్ లో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బోధన్ మండలం పెంట గ్రామానికి చెందిన వెంకట్ (2530) అత్తగారిల్లైన వజ్ర ఖండికి భార్యతో కలిసి ఐదారు రోజుల క్రితం వెళ్లాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం మద్యం సేవించాడు. నువ్విలా మద్యం మానేయకపోతే నేను ఇంటికి రానని భార్య ఆగ్రహించింది. దీంతో మనస్థాపానికి గురై, శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని కౌలాస్ నాలా ప్రాజెక్టు బ్యాక్ వాటర్ లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన మృతదేహం గుర్తుపట్టకుండా శరీరమంతా ఉబ్బిపోయింది. అత్త,మామలు కూడా సంఘటన స్థలానికి వచ్చి గుర్తుపట్టలేక తిరిగి వెళ్లిపోయినట్టు సమాచారం. చివరికి మృతుడి తల్లిదండ్రులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు.

## కొండి రాములు సంతాప సభకు పెద్ద ఎత్తున హాజరు కావాలి: పానుగంటి పర్వతాలు




**చట్టం శంషాబాద్ :**

ఇబ్రహీంపట్నం మాజీ శాసనసభ్యుడు, సిపిఐ సీనియర్ నాయకుడు కొండి రాములు సంతాప సభ ఈ నెల 31న ఇబ్రహీంపట్నంలో నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర నాయకుడు పానుగంటి పర్వతాలు తెలిపారు. ఈ సభకు సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ శంషాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యాలయంలో సంతాప సభ పోస్టర్ విడుదల కార్యక్రమం మండల కార్యదర్శి నర్రగిరి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్ యాదగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ, కొండి రాములు విద్యార్థి దశ నుంచే విప్లవోద్యమానికి ఆకర్షితులై ఎర్రజెండా చేతబట్టి ప్రజల తరపున అనేక పోరాటాలు నిర్వహించిన నాయకుడని అన్నారు. నిరాడంబర జీవితం గడిపిన రాములు వంటి నాయకులు ఈనాటి సమాజానికి అవసరమని పేర్కొన్నారు. ఆయన మరణం విప్లవోద్యమాలకు తీరని లోటని అభిప్రాయపడ్డారు. మార్చి 31న ఇబ్రహీంపట్నంలో జరిగే సంతాప సభకు జిల్లా నలుమూలల నుండి కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ యాదగిరి, నర్రగిరి, శీను, రాజు, ఉమర్, జైన్, రాములు, ఈరయ్య పాల్గొన్నారు.

## శాశ్వత పరిష్కారానికి లోక్ అదాలత్‌కు సిద్ధం కండి

**రాజీ మార్గమే రాజ మార్గం – ఎస్సై బొజ్జ మహేష్ పిలుపు**



**చట్టం/ ఎల్లారెడ్డి :**

వివాదాలకు శాశ్వత పరిష్కారం రాజీ ద్వారానే సాధ్యమని ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. గొడవలు పెంచుకుంటే అవి జీవితకాలం కొనసాగుతాయని, కానీ పరస్పర అంగీకారంతో రాజీకి వస్తే సమస్యలు వెంటనే ముగుస్తాయని ఆయన తెలిపారు. నేడు ఎల్లారెడ్డి కోర్టులో నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమపై ఉన్న కేసులు గానీ, పరిచయస్తుల కేసులు గానీ ఉంటే, రాజీ మార్గంలో పరిష్కరించుకుని కోర్టుకు హాజరైతే కేసులు పూర్తిగా పరిష్కారమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. వివాదాలు కావాలా? రాజీలు కావాలా? నిర్ణయం మీ చేతుల్లోనే ఉంది, అంటూ ప్రజలకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. ఏవైనా సందేహాలుంటే కోర్టు పీసీ వెంకటరమణ (9494262923), ఎస్సై మహేష్ (8712686160)లను సంప్రదించాలని సూచించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై లోక్ అదాలత్ ద్వారా శాంతి, సామరస్యాన్ని నెలకొల్పాలని ఎస్సై బొజ్జ మహేష్ ఆకాంక్షించారు.

## సీతారాముల కళ్యాణోత్సవాల్లో పాల్గొన్న మున్సిపల్ ఛైర్పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు



**చట్టం - సిద్దిపేట ప్రతినిధి:**

శ్రీరామ నవమి సందర్భంగా సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు సహకారంతో 23వ వార్డులోని సుగుణ సతీష్ ఆసుపత్రి సమీపంలోని హనుమాన్ దేవాలయంలో జరిగిన కళ్యాణోత్సవానికి మున్సిపల్ ఛైర్పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు ఫలాలు, పుష్పాలు సమర్పించారు. అనంతరం 23వ వార్డులోని శివాలయం, 22వ వార్డులోని పంచముఖ హనుమాన్ దేవాలయం, 24వ వార్డులోని విశాలాక్షి సమేత విశ్వేశ్వరాలయంలో జరిగిన సీతారాముల కళ్యాణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరిపై సీతారాముల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాయకం లక్ష్మణ్, డాక్టర్ సుగుణ సతీష్ దంపతులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## మాటలతో కాదు పనితోనే గెలుపు

**ప్రజల్లో నమ్మకం కోల్పోతున్న నాయకుడు**

**చట్టం కొల్చారం :**

మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలో రాజకీయంగా చర్చనీయాంశంగా మారిన ఒక నాయకుడిపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. బిఫామ్ పొందినా ఎన్నికల్లో గెలవలేకపోయిన ఈ నాయకుడు, ప్రజల సమస్యలపై కన్నా మాటలపైనే ఆధారపడుతున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి చిన్న సందర్భాన్ని కూడా పెద్ద వేడుకలా నిర్వహిస్తూ, జన్మదినాల పేరుతో కేకులు కట్ చేయడం, భారీగా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుండగా, గ్రామాల అభివృద్ధి మాత్రం కనబడటం లేదని స్థానికులు అంటున్నారు. అభిమానులు “అభివృద్ధి చేస్తాడు” అని చెప్పుకుంటున్నా, వాస్తవ పరిస్థితుల్లో మాత్రం మార్పు కనిపించకపోవడం ప్రజలను నిరాశకు గురిచేస్తోంది. ఎన్నికల సమయంలో ఇంటింటికి వెళ్లి హామీలు ఇచ్చే ఈ నాయకుడు, ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రజలకు అందుబాటులో లేకపోవడం ప్రధాన విమర్శగా మారింది. గ్రామాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం వల్ల ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ఇప్పటికైనా మాటలకంటే పనికి ప్రాధాన్యత ఇచ్చి ప్రజల నమ్మకం గెలుచుకోవాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మృతి



**చట్టం, బోథ్ :**

ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి అక్కపెల్లి లక్ష్మణ్ రోడ్డు ప్రమాదంలో మరణించారు. శుక్రవారం నేరడిగొండ మండలం కుప్టిఘాట్ సమీపంలో జరిగిన ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్ కు తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. లక్ష్మణ్ మృతి పట్ల మాజీ ఎంపి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## మలుపుల వద్ద అతివేగం ప్రమాదకరం

**వాహనదారులకు సీఐ రఘుకుమార్ సూచనలు**



**చట్టం వికారాబాద్ ప్రతినిధి :** ఫిబ్రవరి నెలలో బుగ్గరామేశ్వరం ఆలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకు మృతి చెందిన ఘటనను దృష్టిలో ఉంచుకుని, ఫారెస్ట్ ప్రాంతంలోని డీప్ మలుపుల వద్ద వాహనాల వేగ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వికారాబాద్ సీఐ రఘుకుమార్ తెలిపారు. ప్రమాదాలు నివారించేందుకు రోడ్డు మధ్యలో బొల్లార్డ్స్ ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని తగ్గించే చర్యలు అమలు చేస్తున్నామని చెప్పారు. మలుపుల వద్ద ఓవర్‌టేక్ చేయడం ప్రమాదకరమని, ఎదుటి వాహనం కనిపించకముందే ఓవర్‌టేక్ చేయకూడదని సూచించారు. అతివేగంగా వాహనాలు నడపడం వల్ల ప్రాణ నష్టం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొంటూ, డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా మాత్రమే ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని కోరారు.

## బిచ్కుంద మున్సిపాలిటీలో ఘనంగా శ్రీరామనవమి శోభాయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**చట్టం బిచ్కుంద:** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించిన శ్రీ రామ నవమి శోభాయాత్రలో *కే. విజయ భాస్కర్ రెడ్డి* పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నౌషా నాయక్ దర్పల్ గంగాధర్ , దర్పల్ సంతోష్ , మార్కెట్ కమిటీ డైరెక్టర్ సైని అశోక్ , బాలకృష్ణ , పోతుల అనిల్ , జాదవ్ పండారి , బనోత్ రాజు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తి శ్రద్ధలతో శ్రీరామ నామస్మరణ చేస్తూ శోభాయాత్రను మండలంలోని ప్రధాన వీధుల గుండా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రజలకు శ్రీ రామ నవమి శుభాకాంక్షలు తెలియజేసి, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చేతన్ నగర్ అభివృద్ధి పనులకు శ్రీకారం



**చట్టం కోటగిరి/ పోతంగల్ :** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని చేతన్ నగర్‌లో అభివృద్ధి పనులను సర్పంచ్ కుర్వాడే కాంత ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, గతంలో ప్రారంభించి మధ్యలో నిలిచిపోయిన పనులను మళ్లీ ప్రారంభించి పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కేటాయించిన నిధులతో గ్రామంలో మౌలిక వసతులు, ముఖ్యంగా నీటి సౌకర్యాన్ని మెరుగుపరచడానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాదవ్ రావు, వార్డు సభ్యులు నెమలి సావిత్రి, నర్సింలు, వాగ్మారే లక్ష్మణ్, పులి జ్యోతి సాయిలు, నక్కేవర్ రాజాబాయి, నెమలి హన్మంతు పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు దేవునాలే గంగుబాయి, మక్కయ్య, సంజు, గోదావరి, జనబాయి తదితరులు మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో ఘనంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం



**చట్టం శంషాబాద్ ప్రతినిధి :** సీతారాముల కళ్యాణం సనాతన ధర్మంలో అత్యంత పవిత్రమైన, కమనీయమైన ఆధ్యాత్మిక వేడుక అని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం శంషాబాద్ మండలం నర్కూడలో నిర్వహించిన శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీతారాముల కళ్యాణం కేవలం ఇద్దరి వివాహం మాత్రమే కాకుండా లోక కళ్యాణార్థం జరిగే దివ్య లీలా అని తెలిపారు. సుఖదుఃఖాల్లో, అడవిలోనైనా, రాజభవనంలోనైనా కలిసుండే ఆదర్శ బంధం సీతారాములదని చెప్పారు. ఈ మహోత్సవాన్ని ప్రత్యక్షంగా వీక్షించడం భక్తులకు కన్నుల పండుగగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, ఓబీసీ మోర్చా కిసాన్ ప్రధాన కార్యదర్శి నాన్నవాళ్ల కుమార్ యాదవ్, వంశి యాదవ్, కుమార్ యాదవ్, శ్రీధర్, ప్రవీణ్ యాదవ్, వీరేష్, జైహింద్ యాదవ్, శ్రీకాంత్, ప్రకాష్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆవుల రాజిరెడ్డి జన్మదిన వేడుకలు

**చట్టం వెల్దుర్తి :** నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి జన్మదిన వేడుకలను వెల్దుర్తి మండల కేంద్రంలో స్థానిక బస్టాండ్ వద్ద మండల పార్టీ అధ్యక్షులు మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఆవుల రాజిరెడ్డి ఎన్నికలలో ఓటమి చెందినప్పటికీ ప్రజలకు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందేలా నిరంతరం కృషి చేస్తున్న గొప్ప నాయకుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, నరసింహారెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి నంబూద్రి గుప్త, శేఖ గౌడ్, కిష్టా గౌడ్, పట్టణ అధ్యక్షులు మల్లేశం చారి, నరేందర్ రెడ్డి, ముక్తా బాయి, కృష్ణ, అరికెల సత్తయ్య, దుర్గా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక
CHATTAM NEWS
నిజామాబాద్
శనివారం
28.03.2026


# అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం

**చట్టం, శంషాబాద్ :**

భద్రాచల సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా చూడముచ్చటగా ఏ విధంగా జరుగుతుందో అదే తరహాలో నర్కుడ అమ్మపల్లి సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలిపారు. శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలోని అమ్మపల్లి సీతారాముల కళ్యాణ మహోత్సవనికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తన సొంత నిధులతో సీతారాములకు పట్టు వస్త్రాలు,తలంబ్రాలు అందజేయడం జరిగిందని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మపల్లి సీతారాముల కళ్యాణ మహోత్సవం ఎంతో చూడముచ్చటగా,అత్యంత వైభవంగా భద్రాచలం రాముడి కళ్యాణం తిలకించినంత వైభవంగా ఉంటుందని ఆయన సూచించారు. శంషాబాద్ మండలంలోని ప్రజలంతా తండోపతండాలుగా విచ్చేసి సీతారాముల కళ్యాణ మహోత్సవంలో భాగస్వాములై స్వామివారికి కళ్యాణ నిర్వహించడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు. గర్భాలయంలో అమ్మపల్లి సీతారాములు,లక్ష్మణ విగ్రహమూర్తులు ఏకశిలా పై ఉండడమే ఈ దేవాలయానికి అత్యంత శక్తివంతంగా విరజిల్లుతుందన్నారు. ఇలాంటి దేవాలయంలో సినిమాలు, సీరియలు ఇక్కడ షూటింగ్ చేస్తే తప్పకుండా విజయం తథ్యం అవుతుందని నమ్మకంతో ప్రతి ఒక్కరు చిన్న పెద్ద తేడా అనే తారతమ్యం లేకుండా అధిక సంఖ్యలో విచ్చేసి సీతారాముల దర్శనం చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండలం మాజీ జెడ్పిటిసి నీరటి తన్వి రాజు ముదిరాజ్, సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్, ఉప సర్పంచ్ నిరటి మహేష్ ముదిరాజ్, కోలన్ మహేందర్ రెడ్డి, కోడిగంటి చంద్ర రెడ్డి, గణేష్ గుప్తా, హి శివాజీ, ధనుంజయ్, తోంట అశోక్, జంగయ్య, ఆలయ ధర్మ కర్తలు, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు విచ్చేసి సీతారాముల కల్యాణం తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



## ముథోల్ నియోజకవర్గంలోని శ్రీరామనవమి ఉత్సవంలో ఎమ్మెల్యే హాజరు



**చట్టం, భైంసా :** ముథోల్ నియోజకవర్గం లోని కుంటాల కుబీర్ లోకేశ్వరం, ముథోల్ బాసర భైంసా మండల పరిధిలోని ఆయా గ్రామాలలో శుక్రవారం శ్రీరామనవమి వేడుకల శుభ సందర్భంగా శ్రీ రాముని కళ్యాణ ఉత్సవంలో ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ తో పాటు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఎవరు కూడా మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ అందరూ స్వచ్ఛందంగా నృత్యాలు చేస్తూ కీర్తన భక్తి భజనలు పాడుతూ మన దేశ సనాతన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడం మనందరి బాధ్యతగా తీసుకోవాలని శాంతియుతంగా పండుగ వాతావరణంలకొల్పే విధంగా శ్రీరామనవమి ఉత్సవాలను జరుపుకోవాలని తెలిపారు. దీనితో వివిధ గ్రామాలలో మండలాలో యువకులు గ్రామస్తులు భాజా భజంత్రీల మధ్య నృత్యాలు చేస్తూ గ్రామపురవిధులలో శ్రీ రాముని ఉత్సవ మూర్తితో శోభాయాత్ర చేపట్టి వైభవంగా శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించారు.

## హిందువుల మనోభావాలు దెబ్బతీసే పోస్టు



**చట్టం కోటగిరి / పోతంగల్ :** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని పోతంగల్ గ్రామానికి చెందిన షేక్ జీషన్ (తండ్రి ఖదీర్) శ్రీరామనవమి సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో శ్రీరాముడి ఫోటో కింద హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా జంతువుల చిత్రాలను షేర్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయంపై అదే గ్రామానికి చెందిన గంట్ల రవి (తండ్రి సాయిలు) పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

## రాముడు లోకానికి ఆదర్శం



**చట్టం సిద్దిపేట (దుబ్బాక) :** శ్రీరామనవమి పురస్కరించుకొని భక్తులు గ్రామ, గ్రామన భక్తితో లిఖించిన 25కోట్ల లిఖిత శ్రీరామ నామాలతో అద్దాల మందిరంలో కొలువైన శ్రీ సీతారాములకు శుక్రవారం నాడు ప్రత్యేకంగా అభిషేకించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ లోని శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు. భజనలతో, కీర్తనలతో భగవంతుణ్ణి సేవించుకున్నారు. రామనామ స్మరణతో ప్రాంగణం మారుమోగింది. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ రామనామ స్మరణ చేస్తే ఆనందం లభిస్తుందన్నారు. ఆ నామంలో ఉన్న మంత్రశక్తి మనలో దుఃఖాల్ని సమూలంగా నాశనం చేసి ఆనందాన్ని ఇస్తుందన్నారు. భవభయజనితమైన అజ్ఞానాన్ని, అవిద్యని పోగొట్టి మోక్షాన్ని ఇవ్వడమే ఆనందం అన్నారు. దాన్ని ప్రసాదించే తారకబ్రహ్మస్వరూపుడు శ్రీరాముడే అని అన్నారు. రాముడు లోకానికి ఆదర్శం అన్నారు. రామకోటి వ్రాయని వారు ఎవరైనా ఉంటే శ్రీరామనవమి నుండి ప్రారంభించాలని కోరారు.

## అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం



**చట్టం నసురుల్లాబాద్ :** కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండల కేంద్రంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని రామాలయం, నాచుపల్లి గ్రామ శివారులోని రామాలయం, నెమ్లి సాయిబాబా ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో వేడుకల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. స్వామివారి దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైద్యునిపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలి



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** నిర్మల్ జిల్లా కేంద్రంలో సీనియర్ వైద్యులు డాక్టర్ చిటికేశి, సంతోష్ రాజ్, పై దాడి చేసిన నిందితులను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... వైద్యులపై దాడి జరిగి కొన్ని రోజులు కావస్తున్న ఇప్పటివరకు పోలీసు యంత్రాంగం ఎలాంటి స్పందన లేకపోవడంతో దుయ్యబట్టారు. అనంతరం నేరుగా వైద్యుడు సంతోష రాజ్ ఎమ్మెల్యే పరామర్శించారు. దాడికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పేషెంట్ కుటుంబ సభ్యులు వైద్యునిపై దాడి చేసి 24 గంటలు గడుస్తున్న నిందితులను పోలీసులు ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. న్యాయం చేయాలని వైద్యులందరూ రోడ్డెక్కితే పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. ఇలాంటి దాడులు పునరావృత్తం కాకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరి వెంట భారతీయ జనతా పార్టీ ప్రజాప్రతినిధులు కార్యకర్తలు నాయకులు తదితరులు ఉన్నారు.

## ఎల్లారెడ్డికి కవితా గౌరవం

**చట్టం / ఎల్లారెడ్డి :** శ్రీరామ నవమి సందర్భంగా 'ఆదర్శ ప్రాయుడు శ్రీ రాముడు' అనే అంశంపై నిర్వహించిన కవితా పోటీలలో ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన యువ కవి సింగీతం సంతోష్ కుమార్ తన ప్రతిభను చాటుకుని ప్రశంసా పత్రం అందుకున్నారు. నేను సైతం రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలో ఆయన ప్రతిభకు గుర్తింపుగా ఆన్లైన్ ద్వారా ఈ సత్కారం లభించినట్లు సంతోష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సాహిత్య రంగంలో తన ప్రత్యేక శైలితో ఆకట్టుకుంటున్న సంతోష్ కుమార్‌కు ఈ గౌరవం రావడం పట్ల పట్టణంలో ఆనందం వ్యక్తమవుతోంది.

## అంగరంగ వైభవంగా రాములోరి కళ్యాణం

### ఆక్సీజన్ మిషన్ అందజేత

**చట్టం న్యూస్ గంగారం :**



మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం కోమట్లగూడెం గ్రామ పరిధిలోని కోదండ రామాలయంలో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పరిసర ప్రాంతాలలోని ప్రజలు రామభక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పూజా కార్యక్రమాలతో పాటు దంపతులకు నూతన వస్త్రాలు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అలాగే అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.అలాగే శ్రీ కోదండరామాలయం ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం గంగారం గ్రామానికి చెందిన మెంతినీ సారక్క వయస్సు 60 సం రాలు అనారోగ్యంతో హన్మకొండలోని చక్రవర్తి ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కారణంగా 10 రోజులు పాటు ఐసీయూలో ఉండాల్సి వచ్చి దాదాపు రూ.1,50,000 వరకు ఖర్చు చేశారు డాక్టర్లు సూచన మేరకు ఇంటి వద్ద కూడా ఆక్సిజన్ మిషన్ అవసరం ఉండటంతో,ఈ విషయాన్ని కోదండరామలయ వైద్య కమిటీ దృష్టికి తీసుకెళ్లారు . వెంటనే స్పందించి ఆలయ చైర్మన్ సైపా సురేష్‌నేతృత్వంలోని బృందం,సోనూ సూద్ ఫౌండేషన్ సహకారంతో ఆక్సిజన్ మిషన్ ను సమకూర్చి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య కమిటీ చైర్మన్ ప్రతాపని శ్రీకాంత్ గ్రంథాలయ చైర్మన్ పల్లె సురేష్ కార్యనిర్వాహణ అధ్యక్షులు దుర్గం వేణు ,దుర్గం కృష్ణ ,గొగ్గల దిలీప్ , గొగ్గల భద్రయ్య పవన్ కళ్యాణ్, గిరిగాని రవి అలాగే గ్రామ పెద్దలు మేడ సమ్మయ్య గొగ్గల లక్ష్మయ్య దుర్గం సమ్మయ్య జనగాం పెంటయ్య,సాగర్, శ్రీను ప్రతాపని సంతోష్, గొగ్గల ప్రభాకర్ తాళ్ళ అశోక్.దార మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు పెరగకుండా కేంద్రం చర్యలు: మహేశ్వర్ రెడ్డి



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :**

ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొన్నప్పటికీ దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరగకుండా కేంద్ర ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు తీసుకుందని బీజేపీ ఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ఇంధన ధరలు పెరుగుతాయేమో, కొరత ఏర్పడుతుందేమో అన్న ఆందోళన ప్రజల్లో నెలకొన్నదని ఆయన చెప్పారు. అయితే సామాన్యుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం వెంటనే స్పందించి పెట్రోల్, డీజిల్ ధరలు పెరగకుండా చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. పెట్రోల్‌పై ఉన్న ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.13 నుంచి రూ.3కి తగ్గించగా, డీజిల్‌పై ఉన్న ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా తొలగించారని తెలిపారు. దీంతో వినియోగదారులకు ఉపశమనం కలిగిందని చెప్పారు. అంతర్జాతీయంగా చమురు సరఫరాలో ఆటంకాలు ఉన్నప్పటికీ దేశానికి గల్ఫ్ ప్రాంతం నుంచి చమురు సరఫరా సాఫీగా కొనసాగేందుకు విదేశాంగ విధానం కీలక పాత్ర పోషించిందని వివరించారు. కొన్ని దేశాల్లో ఇంధన కొరత తలెత్తినప్పటికీ భారతదేశంలో అలాంటి పరిస్థితులు రాకుండా చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఇరాన్ యుద్ధం కారణంగా చమురు దిగుమతి వ్యయం పెరిగినప్పటికీ ఆయిల్ కంపెనీలు ధరలు పెంచే పరిస్థితి రాకుండా కేంద్రం పన్నులను తగ్గించిందని చెప్పారు. సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మరోసారి స్పష్టమైందని మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

## అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం

**చట్టం బీంగల్ :**



భీంగల్‌లోని మోక్షనంద ఆశ్రమం లో శ్రీరాముని కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకులు ముత్యాల సునీల్ కుమార్, మానాల మోహన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మోక్షనంద ఆశ్రమం (వాగు గడ్డ) సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణోత్సవం కొరకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. భక్తులు భారీగా హాజరై భక్తి శ్రద్ధలతో కళ్యాణోత్సవాన్ని వీక్షించారు. వేద పండితులు రఘు పంతులు, ధనుంజయ, మురళి పంతుల మంత్రోచ్చారణల మధ్య సాంప్రదాయబద్ధంగా కార్యక్రమాన్ని నిర్వహించగా, ఆశ్రమం పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పూజలు, హోమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ, అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, మూడు గైండ్ల సంఘాలు, గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## భక్తి పరవశంలో శ్రీరామనవమి వేడుకలు

**చట్టం/హనుమకొండ**



శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని హనుమకొండలో భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఎన్పిడీసీఎల్ సిఎండీ వరుణ్ రెడ్డితో కలిసి రెవెన్యూ కాలనీలోని శ్రీరామాలయాన్ని సందర్శించారు. ఆలయంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రాల నడుమ నిర్వహించిన ఈ పూజల్లో పాల్గొన్న కలెక్టర్ దంపతులు, ప్రజల సంక్షేమం, శాంతి, సౌభ్రాతృత్వం కోసం దేవుడిని ప్రార్థించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శ్రీరామనవమి పండుగ మనకు ధర్మం, న్యాయం, సత్యనిష్ఠ వంటి విలువలను గుర్తుచేస్తుందని అన్నారు. భగవాన్ శ్రీరాముని ఆదర్శాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాలని సూచించారు. సమాజంలో పరస్పర గౌరవం, ఐక్యత, సౌహార్దత పెంపొందించుకోవాలని కోరారు. పండుగ సందర్భంగా ఆలయానికి భారీగా తరలివచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. స్వచ్ఛత, భద్రత, తాగునీటి వంటి సౌకర్యాలను సమకూర్చినట్లు వివరించారు. భక్తులు భక్తి భావంతో, క్రమశిక్షణతో పూజల్లో పాల్గొని పండుగను ఆధ్యాత్మికంగా జరుపుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## భైంసాలో ప్రశాంతంగా శ్రీరామ నవమి ఉత్సవాలు



**చట్టం, భైంసా :** భైంసా పట్టణంలో శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. పురాణ బజార్, గోశాల ప్రాంతాల్లో రాముడి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్రను ఎమ్మెల్యే రామారావు పటేల్, జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ప్రారంభించారు. పట్టణమంతా శ్రీరామ నామంతో మార్మోగింది. హిందు వాహిని సభ్యులు భారీ రాముడు, హనుమంతుడు విగ్రహాలతో ప్రధాన రహదారుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. భక్తులు జైశ్రీరామ్ నినాదాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. మహిళలు, యువకులు డీజే సౌండ్లకు నృత్యాలు చేస్తూ భక్తి పారవశ్యంలో భజనలు పాడారు. కులమత భేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ముస్లిం సోదరులు కూడా శోభాయాత్రలో పాల్గొని ఉచితంగా మజ్జిగ, నీరు పంపిణీ చేసి సామరస్యాన్ని చాటారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. అడుగడుగునా పోలీసు పహారా ఏర్పాటు చేసి శాంతియుతంగా కార్యక్రమాలు సాగేందుకు చర్యలు తీసుకున్నారు. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన పోలీసు శాఖ, రెవెన్యూ అధికారులు మరియు ఇతర శాఖల సిబ్బందికి ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## నాసర్‌పురలో ఘనంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** శ్రీరామనవమి సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని నాసర్‌పుర 31వ వార్డులో సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు భారీగా నాసర్‌పుర హనుమాన్ దేవస్థానానికి తరలి వచ్చారు. ఆలయ పరిసరాలు భక్తి వాతావరణంతో కళకళలాడాయి. లోక కల్యాణానికి సంకేతంగా నిర్వహించిన ఈ కళ్యాణోత్సవం ఆధ్యాత్మికతను ప్రతిబింబించేలా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై రాముల కళ్యాణ ఘట్టాన్ని ప్రత్యక్షంగా వీక్షించి తరించారు. వార్డులోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు. నవమి ఉత్సవాల్లో భాగంగా ఆలయ పండితులు ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరు పక్షాల వారు పసుపు, కుంకుమ, తాంబూలాలు మార్చుకుంటూ భక్తిశ్రద్ధలతో భజనలు చేశారు. అర్చకులు వంశ క్రమం, గోత్ర నామాలను పఠిస్తూ వధూవరుల పక్షాన వాదోపవాదాలు నిర్వహించడం భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సిద్దిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కవిత దంపతులు సీతారాములకు పట్టు వస్త్రాలు, తాంబూలాలు సమర్పించారు. నాసర్‌పుర హనుమాన్ దేవస్థానంలో ప్రతి ఏడాది శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రాంతీయ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బక్రీ చెప్యాలలో ఘనంగా సీతారాముల కళ్యాణం

### పాల్గొన్న గ్రామ సర్పంచ్ జక్కుల శ్రీలత శ్రీనివాస్



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట అర్బన్ మండలం బక్రీద్ చెప్పల గ్రామంలో శ్రీ సీతారాముల కళ్యాణం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గ్రామ సర్పంచ్ జక్కుల శ్రీలత శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా రాముడి ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించి కళ్యాణ వేడుక నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా సీతా కోదండరామ కళ్యాణం

### సిద్దిపేట అర్బన్ మండలం ఏన్సాన్ పల్లి లో శ్రీ సీతారాముల కళ్యాణం



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** శ్రీరామనవమిని పురస్కరించుకుని సిద్దిపేట అర్బన్ మండలం ఏన్సాన్ పల్లి, మిట్టపల్లి, పొన్నాల గ్రామాలలో సీతారాముల కళ్యాణ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఏన్సాన్ పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారాముల ఆలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని మూడు రోజులు ఘనంగా నిర్వహించి శుక్రవారం నవమి రోజున కళ్యాణ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు గ్రామంలో పెద్ద ఎత్తున భక్తులు కళ్యాణోత్సవానికి హాజరై స్వామివారి దర్శనం చేసుకున్నారు. 19 జంటలతో పూజా కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగుల స్రవంతి ప్రశాంత్, చింతల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రవీందర్ గౌడ్, వైస్ ఎంపీపీ ఎల్లం, బిఆర్ ఎస్ నాయకులు భూసాని శ్రీనివాస్, సంపత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కిర్గుల్ గ్రామంలో శ్రీ రామ మందిరానికి భూమి పూజ



**చట్టం, బాసర :** బాసర మండలంలోని కిర్గుల్ (K) గ్రామంలో శుక్రవారం శ్రీరామనవమి ఉత్సవన్నీ పురస్కరించుకొని, తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ సిజిఎఫ్ నిధుల ద్వారా రూ. 22.40 లక్షలతో నిర్మించనున్న శ్రీ రామ మందిరానికి భూమి పూజను ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ నిర్వహించి పనులను ప్రారంభించారు. అంతకుముందు వేద పండితులు వేద మంత్రాలు మధ్య ప్రత్యేక పూజలు చేసి శ్రీరామనవమి శుభ సందర్భంగా ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భూమి పూజ చేసి టెంకాయలు కొట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కేంద్రాల నిర్మాణం ద్వారా సంస్కృతి పరిరక్షణతో పాటు అభివృద్ధి కూడా సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం వచ్చిన వివిధ గ్రామ సర్పంచులకు భక్తులకు గ్రామస్తులకు ఉచిత అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాలేగాం మధుప్రియ సురేష్, తో పాటు ఓని గ్రామ సర్పంచ్, జాదవ్ జగదీష్ పటేల్, కౌటా సర్పంచ్ బాబురావు పటేల్, సోలాపూర్ సర్పంచ్ ఆనందరావు, బాసర మాజీ జెడ్పిటిసి రమేష్, కౌట మాజీ సర్పంచ్ మధుకర్ పటేల్, తో పాటు వివిధ గ్రామ సర్పంచులు ప్రజాప్రతినిధులు నాయకులు గ్రామస్తులు గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు రోడ్ల నిర్మాణానికి 12 కోట్ల 50 లక్షల రూపాయల నిధులు



**చట్టం, ముధోల్ :** నిర్మల్ జిల్లా ముదురు నియోజకవర్గంలోని ముధోల్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఎడ్ బిడ్ తండా నుండి తరోడా తండా వరకు 8 కిలోమీటర్లు ఎస్. టి. ఎస్. డి. ఎఫ్. కింద 5కోట్ల 80 లక్షల రూపాయల నిధులు, రువి తండా వయా గన్నోరా నుండి ముధోల్ వరకు 7.20 కిలోమీటర్ల రోడ్డు కు 6కోట్ల 70 లక్షల రూపాయల నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. అదే విధంగా ముదురు మండల కేంద్రంలో మహిళా సంఘ భవనానికి కూడా నిధులు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో టెండర్ ప్రక్రియ జరిగి పనులు ప్రారంభం అవుతాయన్నారు. నిధులు మంజూరు చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో భైంసా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, జాదవ్ రాజేష్ బాబు, సర్పంచ్ హిరియా నాయక్, గ్రామస్తులు తదితరులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## క్రీడా మైదానం కోసం ఆర్థిక సహాయం



**చట్టం గాంధారి:** గాంధారి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించబోతున్న ముకురం పేట హనుమాన్ ఆలయం వద్ద క్రీడా మైదానానికి 50000/రూపాయలు విరాళంగా ఇచ్చిన మాజీ జడ్పిటిసి హరాలే తానాజీ రావు. క్రీడా మైదానం కోసం యువత చేస్తున్న కృషి అభినందిస్తూ, యువత శరీరక మానసిక వికాసానికి మైదానాలు ఎంత అవసరమో సందేశాన్ని ఇచ్చారు.

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

**చట్టం ప్రతినిధి కామారెడ్డి :** కామారెడ్డిలోని బడ కసాబ్ ఏరియాలోని రైల్వే ట్రాక్ (పిల్లర్ నెం. 513/4) వద్ద గురువారం రాత్రి ఓ గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వయస్సు సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య ఉంటుందని రైల్వే ఎస్సై సాదు లింబాద్రి తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

CHATTAM NEWS

## శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో వైభవంగా కళ్యాణ మహోత్సవం

**పట్టువస్త్రాలు,తలంబ్రాలు సమర్పించిన ఇనగాల**



**చట్టం /పరకాల:** మల్లక్కపేట గ్రామంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో ఈరోజు కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం 0పఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. ఈ మహోత్సవంలో డీసీసీ అధ్యక్షులు మరియు కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాంత ప్రజల సుఖసంతోషాలు, శ్రేయస్సు కోసం ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయ భక్తుల విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనంగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు భక్తులు పాల్గొన్నారు. మహోత్సవం అనంతరం అన్న ప్రసాద వితరణ నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

## మర్రిపల్లిలో ఘనంగా శ్రీ సీతారాముల కళ్యాణం



**చట్టం వేములవాడ రూరల్ :** వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివార్ల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్, ఆలయ కమిటీ. ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని శ్రీ సీతారాముల దివ్య కళ్యాణాన్ని తిలకించి, దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. వేద మంత్రోచ్చారణల మధ్య పూజారులు సంప్రదాయబద్ధంగా కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయి, భక్తి గీతాలు, మంగళహారతులతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసి, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇల్లందుల లాస్య ప్రణీత్ మాట్లాడుతూ గ్రామ ప్రజల సుఖశాంతి, ఐశ్వర్యం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు. గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తాటి





**చట్టం అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం సుధాపల్లి గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణాన్ని వీక్షించిన బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర మాజీ తొలి ట్రైకార్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దయతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పైడి వెంకటేశ్వరరావు, సీతారామస్వామి, రామకృష్ణ, యుగంధర్, కృపాకర్, తాటి చంద్రం, తాటి సాయి, పటేల్, కొర్సా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ నగదుతో సీతమ్మ వారికి నగ సమర్పించిన వృద్ధురాలు



**చట్టం అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా ఆంధ్రాకు చెందిన ఓ వృద్ధురాలు బుచ్చమ్మ తనకు వచ్చే వృద్ధాప్య పింఛన్ నగదుతో సీతమ్మ వారికి నగ కొనుగోలు చేసి సమర్పించడం భక్తి భావానికి నిదర్శనంగా నిలిచింది. ఆర్థికంగా లేమి స్థితిలో ఉన్నప్పటికీ దేవుడిపై అపారమైన భక్తితో ఈ సమర్పణ చేయడం అక్కడి భక్తులను భావోద్వేగానికి గురి చేసింది. ఆమె భక్తిని చూసిన స్థానికులు బుచ్చమ్మ ను ఆంధ్రా ఆధునిక శబరిగా అభివర్ణిస్తూ ప్రశంసలు కురిపించారు. అయితే ఈ వృద్ధురాలు తాను తీసుకొచ్చిన ఆబరణాన్ని ఆలయం అధికారులకు చేరవేయడం ఎలాగో తెలియక పోవడం గమనించిన భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాళ్ అశ్వారావుపేట తహశీల్దార్ సీహెచ్వీ రామక్రిష్ణ సహాయంతో ఆలయ అధికారులకు అందజేయాలని ఆదేశించారు. ఈ అరుదైన ఘటన శ్రీరామ నవమి రోజున జరగడం విశేషంగా మారింది. భక్తి, నమ్మకం ఉంటే ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కావని బుచ్చమ్మ నిరూపించారని పలువురు అభిప్రాయపడ్డారు.

## ఉప్పు లింగాపూర్ గ్రామంలో కన్నుల పండుగగా రాములోరి కళ్యాణం



**చట్టం వెల్దుర్తి :** వెల్దుర్తి మండలంలోని ఉప్పు లింగాపూర్ రామాలయంలో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా కళ్యాణ మండపానికి తీసుకువచ్చి మండపంలో అధిష్టింపజేసి సీతారాములను పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పెళ్లికొడుకు, పెళ్లికూతురు, వేషధారణలో సీతారాములు దగదగా మెరిసిపోయారు మొదటగా కన్యాదానం నిర్వహించి ఆగమ శాస్త్రం ప్రకారం మధ్యాహ్నం 12.00 గంటలకు సీతారాముల శిరస్సులపై అర్చకులు గిరీశ్వర్ శర్మ జీలకర్ర బెల్లం ఉంచారు. ఆ తర్వాత మంగళసూత్రాన్ని అర్చకులు వంశీ శర్మ రాముని తరపున సీతమ్మకు అలంకరించారు. మంగళసూత్ర ధారణ తర్వాత సీతమ్మ రామయ్య తలంబ్రాల వేడుక జరిగింది. లోక కళ్యాణం కోసం శ్రీరాముడు సీతమ్మను పెళ్లాడి ఆదర్శ దంపతులుగా వర్ధిల్లారని వేద పండితులు తెలిపారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగి తేలారు ఆలయ పూజారి తీర్థ ప్రసాదం తలంబ్రాలు పంపిణీ చేశారు ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్న ప్రసాదం బెల్లం పానకం వితరణ చేశారు. సాయంత్రం సీతారాముల పల్లకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వంచ భూపాల్ రెడ్డి గ్రామ ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా రాములోరి కళ్యాణం



**చట్టం అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం రంగువారి గూడెం ఎస్టి గ్రామ పరిధిలోని కోదండ రామాలయంలో వేద సంకల్ప సేవా ట్రస్ట్, దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ వారు రంగువారి గూడెం రామాలయంలో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పరిసర ప్రాంతాలలోని ప్రజలు రామభక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వేద సంకల్ప సేవా ట్రస్ట్, దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందించిన రూ•10 వేల ఆర్థిక సహాయంతో పూజా కార్యక్రమాలతో పాటు దంపతులకు నూతన వస్త్రాలు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంతులుకి కూడా సంభావనను అందించినారు. సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు ఉభయ తెలుగు రాష్ట్రాలలో 63 కు పైగా దేవస్థానాలకు శ్రీరామనవమి వేడుకలకు ఆర్థిక సహాయం అందించిన వేద సంకల్ప సేవా ట్రస్ట్, దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ కు భక్తులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్వాహకులు తాళ్ల దుర్గయ్య దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ జిల్లా ఇన్చార్జ్ గిద్దా కొండయ్య, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ST క్రిస్టియన్లపై దుష్ప్రచారాలకు గట్టి ఖండన

**గిరిజనుల రిజర్వేషన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ కోల్పోరు**



**చట్టం – జీలుగుమిల్లి :**

క్రిస్టియానిటీ స్వీకరించిన గిరిజనుల రిజర్వేషన్లు రద్దవుతాయని జరుగుతున్న అసత్య ప్రచారాలను పోలవరం నియోజకవర్గ క్రిస్టియన్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ ప్రచారాలు పూర్తిగా అవాస్తవమని, గిరిజనులలో భయాందోళనలు సృష్టించేందుకు కొందరు కావాలనే చేస్తున్న ప్రయత్నమని తెలిపారు. ఈ సందర్భంగా పోలవరం నియోజకవర్గ క్రిస్టియన్ JAC అధ్యక్షుడు బరగటి ఎజ్రా శాస్త్రి మాట్లాడుతూ, గిరిజనులు ఏ మతాన్ని అనుసరించినా వారి ST హక్కులు రాజ్యాంగపరంగా రక్షితమని స్పష్టం చేశారు. మత మార్పిడి కారణంగా రిజర్వేషన్లు పోతాయని జరుగుతున్న ప్రచారం పూర్తిగా తప్పుడు మరియు దారితప్పించే విధంగా ఉందని పేర్కొన్నారు. UPF ప్రెసిడెంట్ సురేష్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం గిరిజనుల హక్కులను కాపాడటానికి బలమైన భరోసా కల్పిస్తుందని, ఎలాంటి వదంతులను నమ్మకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. UPA సెక్రటరీ సియోన్ కుమార్ మాట్లాడుతూ, సమాజంలో విభేదాలు రేకెత్తించడానికి ఇలాంటి దుష్ప్రచారాలు జరుగుతున్నాయని, వాటిని అందరూ కలసి ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ ఆదివాసీ క్రైస్తవ ఐక్య వేదిక అధ్యక్షుడు నిరీక్షణరావు మాట్లాడుతూ, గిరిజన క్రిస్టియన్ల హక్కులపై ఎలాంటి అనుమానం అవసరం లేదని, శాంతి, ఐక్యతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. న్యాయవాది జువ్వల బాపూజీ మాట్లాడుతూ, చట్టపరంగా గిరిజనుల హక్కులు సంపూర్ణంగా రక్షించబడుతున్నాయని, తప్పుడు ప్రచారాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూరం వెంకటేశ్వరరావు, అఖిల్, ఐజయ్య, ఫిలిప్, రవి తదితరులు, అలాగే నియోజకవర్గానికి చెందిన ST పాస్టర్లు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గిరిజనుల హక్కులపై ఎలాంటి అపోహలకు తావులేదని, ప్రజలు నిజమైన సమాచారాన్ని మాత్రమే నమ్మి ఐక్యంగా ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు.

## ప్రగతి సింగారంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



**చట్టం/ పరకాల :** హనుమకొండ జిల్లా శాయంపేట మండలం ప్రగతి సింగారం గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి - జ్యోతి దంపతులు పాల్గొని స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, శ్రీరాముని ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా సీతారాముల కళ్యాణం

**చట్టం, బోథ్ :** బోథ్ మండలంలోని కౌఠ(బి) గ్రామంలో శుక్రవారం సీతారాముల కళ్యాణం కన్నుల పండుగ సాగింది. ఉదయం సీతారాముల ఉత్సవ విగ్రహాలని శోభాయాత్ర నిర్వహించగా అత్యంత భారీ ఎత్తున భక్తులు ఈ శోభా యాత్రలో పాల్గొన్నారు. అనంతరం వేద పండితులు నమలికొండ సంతోష్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో కళ్యాణ కార్యక్రమం నిర్వహించారు. మొదటగా గణపతి, గౌరీ పూజా, పుణ్యాహవాచనం అనంతరం కార్యక్రమం నిర్వహించారు. సీతారాముల విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించి కళ్యాణ నిర్వహించారు. అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాముల గుట్ట రామాలయంలో ఘనంగా కళ్యాణ మహోత్సవం

**చట్టం నస్రుల్లాబాద్:** కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామ శివారులోని రాముల గుట్ట తండాలో ఉన్న రామాలయంలో శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాదం, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. శనివారం తెల్లవారుజామున 3 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటల నుండి కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## కళ్యాణ మహోత్సవంలో బీజేపీ నాయకులు



**చట్టం కొల్చారం :** శ్రీరామనవమి సందర్భంగా కొల్చారం మండలం రాంపూర్ మరియు కిష్టాపూర్ గ్రామాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్, నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ వనముల బుచ్చేష్ యాదవ్, సీనియర్ నాయకుడు రమణారావు, 8వ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్, పట్టణ ప్రధాన కార్యదర్శులు రామ్ రెడ్డి, సంఘసాని రాజు, నాయకుడు కార్తిక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రాంత ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ధర్మారం గ్రామంలో అంగరంగ వైభవంగా శ్రీ సీతారామచంద్రుల కళ్యాణం

**చట్టం / పరకాల :** నడికుడ మండలం ధర్మారం గ్రామంలోని శ్రీ హనుమంతుని మందిరం ముందర శ్రీ సీతారామచంద్రుల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగినది. ఈ యొక్క కళ్యాణం ఆలయ కమిటీ మరియు ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విజయవంతంగా జరిపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ధర్మారం ఉపసర్పంచ్ పల్లె వెంకన్న గౌడ్, ఓడిసిఎంఎస్ మాజీ వైస్ ఛైర్మెన్ గోల్కొండ సదానందం, గ్రామాల ప్రజలు హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం స్వామివారి సన్నిధిలో తీర్థ ప్రసాదం,అన్న ప్రసాదం స్వీకరించి ఆ సీతారామచంద్రల కృపకు పాత్రులయ్యామని సంతోషితులైనారు.

## కామారెడ్డిలో శ్రీరామ శోభాయాత్రలో పాల్గొన్న పైడి ఎల్లారెడ్డి



**చట్టం ప్రతినిధి కామారెడ్డి :** శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం కామారెడ్డి జిల్లాలో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి కామారెడ్డిలోని ధర్మశాల నుండి శ్రీరామ శోభాయాత్ర ప్రారంభమైంది. హిందు వాహిని ఆధ్వర్యంలో పట్టణ ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీకి ఏఎస్పీ చైతన్య రెడ్డి, సీఐ నరహరి పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి, మురళీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సీతారాముల కళ్యాణంలో ఛైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్



**చట్టం ప్రతినిధి కామారెడ్డి :** శ్రీ రామనవమి సందర్భంగా పట్టణంలోని పలు కాలనీల్లో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకల్లో మున్సిపల్ ఛైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు, మంగళహారతులతో పాల్గొని భక్తులతో కలిసి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్పర్సన్ గోదావరి స్వామి, కళ్లెం సావిత్రి సత్యం పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

## కల్లూర్ గ్రామం నుండి కొండగట్టు వరకు మహా పాద యాత్ర



**చట్టం కోటగిరి /పోతంగల్ :** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోనీ కల్లూర్ గ్రామం నుండి కొండగట్టు అంజన్న క్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరిన యువ స్వాములకు గ్రామస్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పాదయాత్రలో యువకులు, గ్రామ పెద్దలు, మిత్రులు పూలమాలలతో సత్కరించి వారి యాత్ర విజయవంతంగా సాగాలని భక్తిశ్రద్ధలతో, నియమ నిష్టలతో ఈ పాదయాత్రను చేపట్టిన యువతను పలువురు అభినందించారు. హనుమంతుని ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, యువకులు క్షేమంగా యాత్ర ముగించుకుని తిరిగి రావాలని గ్రామస్థులు కోరుకున్నారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, హనుమాన్ మాలధారణ స్వాములు తదితరులు పాల్గొన్నారు. పాదయాత్రలో పాల్గొన్న స్వాములు రెవుల విట్టల్, రెవుల రాము, మెత్రి గంగాధర్, అక్కమ్మ లింగం, మరియు దొడ్డిమిది హరీష్ పటేల్ యాత్రను ప్రారంభించారు. గ్రామస్థులు యువకులు సంఖ్యలో పాల్గొని ఈ యాత్ర దిగ్విజయంగా సాగాలని యువ స్వాములను సాగనంపారు.

## నేత్రపర్వంగా శ్రీరామనవమి వేడుకలు



**చట్టం, బాసర :** బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి క్షేత్రంలో బాసర మండల కేంద్రంలోని శుక్రవారం శ్రీరామనవమి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. గ్రామ పురవీధుల గుండా ప్రత్యేక వాహనంపై శ్రీరాముని ప్రతిమ తో శోభాయాత్ర నిర్వహించారు. భాజా భజంత్రీ డప్పుల వైద్యులతో సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్, విడిసి గ్రామ అధ్యక్షుడు నుకం లింగారావు, బజరంగ్దళ్ యువకులు, జై హనుమాన్ దళం హనుమాన్ గురు స్వాములు శ్రీనివాస్ గంగేష్ మురళి స్వాములు, యువతి,యువకులు శోభాయాత్ర ప్రారంభ సమయంలో కొబ్బరికాయను కొట్టి ఉత్సవాన్ని ప్రారంభించారు. శోభాయాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొనీ ముఖ్యంగా మహిళలు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. స్వచ్ఛంద సేవ నిర్వాకులు శోభాయాత్ర భక్తులకు మజ్జిగ,త్రాగునీరు అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగాకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం రేణుకపూర్ హనుమాన్ వద్ద స్వచ్ఛందంగా ఓ దాత మహా అన్నదాన ప్రసాదాన్ని అందజేయగా బాసర గ్రామంలో పాటు వివిధ గ్రామస్తులు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని మహా ప్రసాదాన్ని స్వీకరించారు.

## జైపూర్‌లో మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ప్రత్యేక పూజలు



**చట్టం, భైంసా :** శ్రీరామనవమి సందర్భంగా రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో ఉన్న రామ మందిరంలో మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి, మాజీ విజయ డైరీ చైర్మన్ లోకభూమా రెడ్డి, ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి శ్యామ్ నాయక్, మాజీ జడ్పీటీసీ పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి వ్యక్తిగత సహాయకుడు నలం శ్రీనివాస్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పర్వదినాన్ని పురస్కరించుకుని వారు ఆలయంలో పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా ఏఎస్పీ రాజేష్ మీనా వివాహ వేడుకల్లో పాల్గొన్న ప్రతినిధులు అనంతరం జైపూర్‌లో జరిగిన పూజల్లో పాల్గొన్నారు.

## శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**చట్టం /పరకాల :** పరకాల పట్టణంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయము , శ్రీ కుంకుమేశ్వర ఆలయము యందు మరియు నడికూడా మండలం వరి కోల్ గ్రామం యందు వైభవంగా నిర్వహించిన శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవంలో ముఖ్య అతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలను నిర్వహించారు.స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... శ్రీ సీతారామచంద్ర స్వామి ఆశీస్సులతో పరకాల నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో ఉండాలని కోరారు.అలాగే స్వామి వారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు నెలకొనాలని, ప్రజలు ఆరోగ్యంతో, ఆనందంతో జీవించాలని ఆకాంక్షించారు.మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## సీతా రాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన పోచారం శ్రీనివాస్ రెడ్డి

**చట్టం కోటగిరి / పోతంగల్ :** నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని ఆయా గ్రామాలలో మీర్జపూర్, ఎక్లాస్ పూర్ క్యాంప్ లో శ్రీ సీతరాముల వారిని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి శ్రీ రామ నవమి సందర్భంగా పలు ఆలయాలలో శ్రీ సీతా రాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి పుష్ప దంపతులు, పోచారం శంభురెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, పోచారం సురేందర్ రెడ్డి ఈ కళ్యాణ మహోత్సవం లో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001., and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com